ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

మే 2009
వెల : రూ. 10



కేశవ ధృత బుద్ధ శరీర జయ జగదీశ హరే...

సుబోధ

ధర్మశాస్త్రాలు భగవంతుణ్ణి పొందేమార్గాన్ని మాత్రమే చూపిస్తాయి. మార్గాన్ని తెలుసుకొన్నాక పుస్తకాలతో పని ఏముంది?

ఓ వ్యక్తికి తన గ్రామం నుంచి ఒక ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరంలో తమకు కొన్ని వస్తువులను కొని పంపాల్సిందిగా బంధువులు కోరారు. అందులో ఇలా ఉంది: "ఐదు సేర్ల మిఠాయి, వంద నారింజ పళ్ళు, ఎనిమిది ధోవతులు పంపు." బంధువులు అడిగిన వస్తువులేమిటో తెలుసుకొన్న తరువాత అతడు ఆ ఉత్తరాన్ని పక్కన బెట్టి వస్తువులు కొంటాడు.

ఆ ఉత్తరం అవసరం ఎంతవరకు? దాన్లోని సంగతులను తెలుసుకొనేంత వరకే! సంగతులు తెలియగానే కావలసిన వస్తువులను కొనడానికి ప్రయత్నించటమే అతడు చేయాల్సిన పని. అలాగే భగవత్ప్రాప్తిని పొందే మార్గాన్ని, అంటే సాక్షాత్కారానికి కావలసిన సాధనలను శాస్త్రాలు మనకు తెలియచేస్తాయి. వాటి పని అంతవరకే! మార్గం తెలిశాక మనం చెయ్యాల్సిన పని సాధన. సాక్షాత్కారమే మన గమ్యం.

దేని సాయంతో మనం భగవంతుణ్ణి తెలుసుకొంటామో అదే బ్రహ్మవిద్య. కేవలం శాస్త్రాలు, వేదాంతం, తర్కం, వ్యాకరణం మొదలైనవన్నీ మనస్సును కలవరపరచేవే. గ్రంథాలు సామాన్యంగా గ్రంథులు (ముడులు). బ్రహ్మజ్ఞానానికి సాధన భూతమైనంత వరకే వాటి ప్రయోజనం. ❖

('శ్రీరామకృష్ణ బోధామృతం' నుంచి)

శ్రీరామకృష్ణ ప్రభ

రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్ – 500 029

ఫోన్: 040-2766 7799, 2763 3936

E-mail : sriramakrishnaprabha@gmail.com

నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద

సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

సురభి

ఒకరోజు నేను (స్వామి ఈశానంద) కోల్పారా నుండి జయరాంబాటీ వస్తున్నాను. ఒక వృద్ధ స్త్రీ కూడా సామాన్లు మోసుకుంటూ మాతృదేవి దగ్గరకు వచ్చింది. మాతృదేవి ఆమెతో, "నువ్వెందుకు చాలా రోజులుగా ఇటు వైపు రాలేదు?" అని ఆప్యాయంగా అడిగారు. అందుకు ఆమె, "ఏం చెప్పమంటావమ్మా! రోజులు గడవడం ఎంతో కష్టంగా ఉంది. కాస్తో కూస్తో సంపాదిస్తున్న నా కుమారుడు కూడా చనిపోయాడు" అంటూ విలపించసాగింది.

ఆమె దుఃఖాన్ని చూసి మాతృదేవి కళ్ళు చెమ్మగిల్లాయి. మాతృదేవి బాధపడడం చూసి ఆమె భోరున ఏడవసాగింది. ఆమె పక్కన కూర్చుని, వసారాలోని స్తంభానికి తల ఆన్చి, ఆమెతో పాటు మాతృదేవి కూడా విలపించసాగారు. ఇద్దరూ ఇలా వెక్కి వెక్కి ఏడవడంతో ఇంట్లోని వారంతా ఒక్క పరుగున వచ్చి ఆ దృశ్యం చూసి విస్తుపోయారు. కాసేపు అలాగే గడిచింది. ఏడుపు ఆగిన తరువాత మాతృదేవి కొబ్బరినూనె తెప్పించి స్వయంగా తామే ఆమె తలకు రాశారు. పిదప మరమరాలు, చక్కెర మొదలైనవి ఒక బట్టలో మూట కట్టి ఆమెకు ఇస్తూ, "మళ్ళీ రా తల్లీ" అన్నారు ఆప్యాయంగా. అప్పటికీ మాతృదేవి కళ్ళు చెమ్మగిల్లే ఉన్నాయి. ఆ స్త్రీ ఎంతో సాంత్వన పొందినట్లు ఆమె ముఖం చెప్పకనే చెప్పింది. ❖

(స్వామి ఈశానంద స్మృతుల నుంచి)

With Best Compliments From

CHAIRMAN & MANAGING DIRECTOR

THE KCP LIMITED

KCP కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 66 సంచిక: 5 మే 2009

పవన తనయ సంకట హరణ మంగళ మూరతి రూప

రామ లఖన సీతా సహిత హృదయ బసహు సుర భూప

పవన కుమారా! సమస్త క్లేశాలనూ నాశనం చేసేవాడా! మంగళమూర్తీ! హనుమంతా! రామ లక్ష్మణ సీతా సహిత, సర్వ దేవతా గణాలతో నా హృదయంలో నివసించుము. (హనుమాన్ చాలీసా)

లోపలి పేజీల్లో...

4 సంపాదకీయం
కపీశ్వరుని కార్యదీక్ష !

6 గోరుముద్ద
అంగవైకల్యమంటే...

7 శ్రీరామకృష్ణుల హనుమత్ భావన

8 పదకవితా పితామహుడు

9 పరమేశ్వరుని పరిరక్షణలో...
ఆకల్ని తీర్చిన ఆనందం!

10 దేవీ వైభవం

12 ప్రియ, అప్రియాలకు మూలం మనస్సు

13 ధీరవాణి
మహోన్నత కర్మయోగి!

14 పరిప్రశ్న

15 ఆచారవ్యవహారాలు- అంతరార్థాలు
మానసిక పూజే ముఖ్యం!

శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి

ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'లో సభ్యులుగా చేరి ధనదానం చేయాల్సిందిగా మనవి. సభ్యుల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు............	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు.................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు	చిరునామా	రూ.
మహారాజ పోషకులు	: శ్రీ ఎన్. వెంకన్న,	పి.వి. రావ్ వీధి, అమలాపురం - 533 201	10,000
పోషకులు	: పి.ఎన్.ఎమ్. ఉన్నత పాఠశాల,	కుకట్‌పల్లి, హైదరాబాద్	2,000
" "	: శ్రీ పి. సిద్ధారెడ్డి,	పులికాట్ నగర్, సూళ్ళూరు పేట, నెల్లూరు జిల్లా	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

ప్రియ భక్తులారా!

యువతరంలో ఆత్మవిశ్వాసాన్ని నింపే యువనాయక స్వామి వివేకానంద స్ఫూర్తివచనాలతో వెలువడుతున్న 'శ్రీరామకృష్ణ ప్రభ'ను రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకూ, కళాశాలలకూ అందించాలని సంకల్పించాం.

శ్రీరామకృష్ణుల, స్వామి వివేకానందుల సందేశాల ఆవశ్యకతను గురించి సుభాష్ చంద్రబోస్ ఒక సందర్భంలో చెబుతూ, "శీలనిర్మాణానికి రామకృష్ణ - వివేకానంద సాహిత్యం కన్నా ఉన్నతమైన సాహిత్యం వేరొకటి లేదు" అని అన్నారు.

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయడానికి మీ ఆర్థిక సహాయాన్ని కోరుతున్నాం. ఈ పథకం కింద రూ. 1500 మొత్తాన్ని జీవిత చందా (20 సంవత్సరాలకు) కట్టినట్లయితే మీరు సూచించిన, లేదా మేము ఎంపిక చేసిన ఒక పాఠశాల/కళాశాలకు 20 ఏళ్ళ పాటు పత్రికను మీ పేరున పంపుతాం. చందాదారుని పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

మీ చందాను ఎమ్.ఓ./డి.డి./చెక్కు రూపంలో Ramakrishna Math, Hyderabad పేరున తీసుకొని, Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029 చిరునామాకు పంపవలెను.

స్వామీజీ ఆదర్శాలకు అనుగుణంగా యువతరాన్ని తీర్చిదిద్దడంలో 'శ్రీరామకృష్ణ ప్రభ' చేపట్టిన ఈ పథకానికి చేయూతనందించగలరని ఆశిస్తున్నాం. భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ప్రార్థిస్తూ...

భగవత్సేవలో

స్వామి జ్ఞానదానంద

అధ్యక్షులు

శ్రీ సాయి బాబా, ఎస్.బి.హెచ్. కాలనీ, తిరుమలగిరి, సికింద్రాబాద్ - 250 పాఠశాలలకు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను స్పాన్సర్ చేశారు.

శ్రీ ఎస్. అనంతకృష్ణ, సూర్యా కేటరర్స్, అంబర్‌పేట్, హైదరాబాద్ - 100 కళాశాలలకు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను స్పాన్సర్ చేశారు.

ముఖచిత్రం : మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌కు 46 కిలోమీటర్ల దూరంలో ఉన్న సాంచీ గ్రామంలోని బౌద్ధ స్థూపం. అశోక చక్రవర్తి నిర్మించిన ఈ స్థూపం క్రీపూ. 3వ శతాబ్దానికి చెందినది. *ఫోటో : స్వామి అనుపమానంద*

ADVERTISEMENT TARIFF

	MULTI COLOUR	B & W
Fourth Cover	Rs.25,000	-
Second Cover	Rs.20,000	-
Third Cover	Rs.20,000	-
Inside Full Page	Rs.15,000	10,000
Inside Half Page	Rs.10,000	5,000

చందా వివరాలు		ఇండియాలో	విదేశాలలో
విడి ప్రతి	:	రూ. 10	-
ఒక సంవత్సర చందా	:	రూ. 100	$ 25
మూడు సంవత్సరాలకు	:	రూ. 280	$ 55
ఐదు సంవత్సరాలకు	:	రూ. 450	$ 85
ఇరవై సంవత్సరాలకు	:	రూ. 1500	$ 365

గమనిక : డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.
పంపవలసిన చిరునామా : Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

లోపలి పేజీల్లో...

16
బొమ్మల కథ
బంగారు బుద్ధుడు

27
మహనీయుల జీవితాల్లో మధురఘట్టాలు
ఆదేశం కాదు ఆచరణ ముఖ్యం

18
మానవత్వం, దివ్యత్వాల సంగమం
దివ్యజనని జీవితం

28
ఆధునిక యుగంలో
ఆధ్యాత్మికత అవసరమా?

20
బుద్ధం శరణం గచ్ఛామి!

30
శీల నిర్మాణానికి
ఆధ్యాత్మికతే ఆధారం!

22
ప్రాచీన గాథలు : జీవన వికాసం
కర్ణుడి చరిత్ర ఓ సాహస యాత్ర

33
మనసు-మర్మం
మనసును ఎందుకు నియంత్రించాలి?

24
అనర్థాలకు మూలం 'అత్యాశ'

34
నా జీవితంలో స్వామి వివేకానంద
పరిపూర్ణతనిచ్చే స్వామీజీ సందేశం!

26
యువవాణి
నవతరం సందేహాలకు సమాధానాలు

35
ధరణిపై వెలసిన దేవత

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు పైన చిరునామాకి కుడి భాగంలో మీ చందా గడువు నెల పొందుపరచబడి ఉంది. సకాలంలో సొమ్ము చెల్లించి, చందా పొడిగించుకొని, 'శ్రీరామకృష్ణ ప్రభ' ఆధ్యాత్మిక వెలుగులు మీ ఇంట నిరంతరాయంగా ప్రసరించేలా సహకరించండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నెంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారితే వెంటనే మాకు తెలియపరచి, సహకరించ మనవి.
- పత్రిక ప్రతీ నెల 26వ తేదీన పోస్ట్ చేయబడుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపు చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ....

- సర్క్యులేషన్ మేనేజర్

SRI RAMAKRISHNA PRABHA, RAMAKRISHNA MATH
Domalguda, Hyderabad - 500 029. Andhra Pradesh
Phone No: 040 - 2766 7799, E-mail : sriramakrishnaprabha@gmail.com

సంపాదకీయం

కపీశ్వరుని కార్యదీక్ష!

ఏ కార్యాన్నైనా సాధించాలంటే మనిషికి ముఖ్యంగా కావలసింది సంకల్ప బలం. ఈ సంకల్ప బలం ఎవరిలో ఉంటుందో వారు తలపెట్టిన కార్యాన్ని సాధించేవరకూ విశ్రమించరు; ఎలాంటి క్లిష్ట పరిస్థితులనైనా ఉత్సాహంతో ఎదుర్కొని ముందుకు పయనిస్తారు, విజయాన్ని సాధిస్తారు. విజయ సౌధానికి పట్టుదలే పునాది.

The sheer power of the 'will' will do everything. The will is stronger than anything else. Everything must go down before the will. ***- Swami Vivekananda***

సంకల్ప బలం సకల కార్యసిద్ధికి మూలం; దాని ముందు ఎలాంటి పరిస్థితులైనా తలవంచాల్సిందే అంటారు స్వామి వివేకానంద.

జీవితంలో అనుకొన్న కార్యాన్ని సాధించడానికి కావలసిన పట్టుదల పరిపూర్ణంగా ఉన్న ధీమంతుడూ, శక్తిమంతుడూ, కార్యతత్పరుడూ అయిన ఆంజనేయస్వామి జీవితం మనకు ఆదర్శం కావాలి.

మనసును భ్రమింపజేసే బాహ్య శత్రువులు : లంకను చేరాలనే ఆరాటంతో ఆంజనేయుడు విరామం ఎరుగని ప్రయాణం సాగిస్తున్నాడు. త్వరగా లంకను చేరాలనీ, సీతమ్మ జాడను తెలుసుకోవాలనే తపన తప్ప వేరే ఆలోచన ఆయనకు లేదు. ఏకనిష్ఠతో వెళుతున్న ఆంజనేయునితో 'రా నాయనా! నా ఆతిథ్యం స్వీకరించు. అమృత తుల్యమైన పండ్లను ఆరగించి, కొంచెం విశ్రమించిన తరువాత నీ ప్రయాణాన్ని కొనసాగించు' అని మైనాకుడు ఆహ్వానించాడు. సంకల్పించిన కార్యంలో జాప్యం జరుగుతుందని భావించిన ఆంజనేయుడు 'నేను రామకార్యార్థమై వెళుతున్నాను. విశ్రాంతి తీసుకోవడానికి నాకు ఇది సమయం కాదు' అని మైనాకుని ఆతిథ్యాన్ని తిరస్కరించాడు. మనం కూడా జాప్యం లేకుండా ఏ పనినైనా సకాలంలో పూర్తిచేయాలంటే సుఖాలను(కోరికలు) త్యజించి విరామం లేకుండా పరిశ్రమించాలి.

సముద్ర లంఘనంలో మరికొద్ది దూరం వెళ్ళగానే సురస అనే రాక్షసి అడ్డుపడి 'ఆంజనేయా! నీవు నాకు ఇప్పుడు ఆహారంగా కావాలి' అని అంది. ఆంజనేయుడు సురసకు వినయపూర్వకంగా నమస్కరించి 'అమ్మా! నేను ఇప్పుడు సీతాన్వేషణ కోసం వెళుతున్నాను. ఆ పని పూర్తిచేసుకుని తిరిగివచ్చి నీ కోరిక తప్పక తీరుస్తాను' అని అన్నాడు. సురస అందుకు అంగీకరించలేదు. ఆంజనేయుణ్ణి మింగాలని తన నోటిని విస్తృతం చేసింది. ఆంజనేయుడు తన శరీరాన్ని ఎంత పెంచితే అంత విశాలంగా సురస తన నోటిని వ్యాపింప చేసింది. అప్పుడు ఆంజనేయుడు సూక్ష్మరూపధారియై సురస విశాలమైన నోటిలోనికి ప్రవేశించి బయటకి వచ్చాడు.

హద్దులు లేకుండా పెరిగే 'ఆశ'యే(లోభమే) మనలో ఉన్న సురస. మనం ఎన్ని సుఖాలను అనుభవిస్తున్నా, ఎంత సంపాదిస్తున్నా వాటితో తృప్తి చెందకుండా ఇంకా సుఖాలను అనుభవించాలనీ, ధనాన్ని ఆర్జించాలనీ రోజు రోజుకీ మనలో పెరిగే ఆశ(కాంచన కాంక్ష) పేరాశగా మారి మనల్ని మింగేస్తుంది. కాబట్టి కాంచన కాంక్ష నుంచి తప్పించుకోవాలంటే ఆంజనేయుడు సూక్ష్మరూపం ధరించినట్లు మన మనోవాంఛల్ని తగ్గించుకోవాలి. అప్పుడే ఆశ అనే సురస బారి నుంచి బయటపడగలం.

అదృశ్యంగా ఉన్న అంతశ్శత్రువులు: కార్యసాధనలో ఉత్సాహంగా పయనిస్తున్న ఆంజనేయుణ్ణి సింహిక అనే రాక్షసి(ఛాయాగ్రాహి) బయటకు కనబడకుండా సముద్రంలో నుంచి తనవైపు లాగింది. అందువల్ల త్వరిత గతిన వెళుతున్న ఆంజనేయుని వేగం మందగించింది. అప్రమత్తంగా ఉన్న ఆంజనేయుడు వెంటనే తనకు కలిగే ఆపదను గ్రహించి సింహికను సంహరించాడు.

కర్తవ్యపాలనలో దృఢచిత్తంతో వెళుతున్న మన వేగాన్ని మందగింపజేసేది మనలో అదృశ్యంగా ఉన్న 'అసూయ'యే సింహిక. ఎవరైనా మనకన్నా అభివృద్ధి సాధించి పేరు ప్రఖ్యాతుల్ని సంపాదిస్తే మనలో తెలియకుండానే వారిపట్ల అసూయ కలుగుతుంది. అసూయాగ్నితో దహించుకుపోతున్న మనసు ఆలోచనా శక్తిని కోల్పోయి మన అభివృద్ధిని మందగింప చేస్తుంది. కాబట్టి ఎల్లప్పుడూ అప్రమత్తతతో ఉండి అసూయ అనే సింహికను ఎదుర్కోవాలి.

ఎన్నో విఘ్నాలను ఎదుర్కొని చివరికి లంకలో ప్రవేశిస్తున్న ఆంజనేయునికి మరొక అవరోధం ఏర్పడింది. సింహద్వారం వద్ద లంకిణి ఆంజనేయుణ్ణి అడ్డుకొని 'నేను ఈ లంకా నగరాన్ని రక్షిస్తున్నాను. నన్ను ఎదిరించిన వారే లోపలికి ప్రవేశించాలి' అని అహంకారంతో గర్జించింది. అహంకార పూరితురాలైన లంకిణిని ఒకే ఒక ముష్టిఘాతంతో అంత మొందించాడు హనుమంతుడు.

చేపట్టిన కార్యంలో అభివృద్ధిని సాధిస్తున్నప్పుడు మనలాంటి ధీరులూ, ధీమంతులూ ఇంకెవరూ లేరనే అహంకారం పెరుగుతుంది. మనలో పర్వతాకారంలో ఎదిగిన అహంకారమే లంకిణి. అహంకారపూరితులు ఎదుటి వ్యక్తిలోని గొప్పతనాన్ని గుర్తించలేరు. అనంత శక్తిమంతుడైన ఆంజనేయుణ్ణి ఒక సాధారణ వానరమని తప్పుగా, తక్కువగా అంచనావేసి తన వినాశనానికి తానే కారకురాలైంది లంకిణి. కాబట్టి అహంకారంతో వ్యవహరించేవారికి వినాశనం తప్పదు. ఎలాగైతే ఆంజనేయుడు అహంకార రూపిణి అయిన లంకిణిని జయించి లంకా నగరంలో ప్రవేశించాడో అలాగే మనలోని అహంకారాన్ని జయిస్తేనే విజయ సామ్రాజ్యంలోనికి ప్రవేశించడం సాధ్యమవుతుంది.

సంకల్ప శక్తికి మనో నియంత్రణే మార్గం: ఎవరి మనసు, ఇంద్రియాలు తమ స్వాధీనంలో ఉంటాయో వారే కామకాంచనాల్నీ, అసూయా అహంకారాల్నీ అధిగమించగలరు. కాబట్టి సంకల్పించిన కార్యాన్ని సాధించడం కోసం మనో నియంత్రణ అత్యంత ఆవశ్యకం.

సంసారస్యాస్య దుఃఖస్య సర్వోపద్రవదాయినః
ఉపాయ ఏక ఏవాస్తి మనసః స్వస్య నిగ్రహః

'సమస్త దుఃఖాల్నీ, సమస్యల్నీ అధిగమించాలంటే మనోనిగ్రహమే శరణ్యం'అని వశిష్ఠ గీత బోధిస్తుంది.

తస్మాత్త్వమిన్ద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ ।
పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞానవిజ్ఞాననాశనమ్॥

'అర్జునా! నువ్వు ముందుగా ఇంద్రియాలను అదుపులో ఉంచుకొని జ్ఞాన విజ్ఞానాలను నశింపచేసే పాప స్వభావం గల ఈ కామాన్ని జయించు' అని శ్రీకృష్ణుడు అర్జునునికి (గీత 3-41) విజయ రహస్యాన్ని బోధించాడు.

ఆంజనేయుడు మనో నియంత్రణ కలిగి ఉండడం వల్లనే తనకు ఎదురైన కష్టాలన్నింటినీ అధిగమించి లక్ష్యసిద్ధిలో కృతకృత్యుడయ్యాడు.

సీతాన్వేషణ ఘట్టంలోని అంతరార్థం: సామాజిక జీవితంతో సీతాన్వేషణ ఘట్టాన్ని అన్వయించుకుంటే ఆంజనేయుడు లంకలో ప్రవేశించి సీతమ్మ జాడను తెలుసుకోవడం ఆయన చేపట్టిన కార్యం. మార్గ మధ్యంలో ఎదురైన అవరోధాలన్నింటినీ అధిగమించి తన గమ్యాన్ని చేరుకున్నాడు ఆంజనేయుడు.

మనం కూడా ఆంజనేయుని లాగే లక్ష్యాన్ని సాధించాలంటే సుఖాల్ని త్యజించి పట్టుదలతో పరిశ్రమించాలి. సన్మానాల వల్ల, అవమానాల వల్ల, విమర్శల వల్ల మనలో పొడచూపే అహంకారాన్నీ, అసూయాద్వేషాలనూ విడనాడాలి.

ఆంజనేయుడు (జీవాత్మ), సీతాదేవి (పరమాత్మ), లంక (దేహం). మనలో ఉన్న కామం (మైనాకుడు), కాంచనం (సురస) అనే బాహ్య శత్రువుల్నీ; అసూయ (సింహిక), అహంకారం (లంకిణి) అనే అంతశ్శత్రువుల్నీ జయించినప్పుడే పరమాత్మ పదసన్నిధికి చేరగలం. ఆధ్యాత్మిక జీవితంలో సీతాన్వేషణ ఘట్టం తెలిపే అంతరార్థం ఇదే!

Every work has got to pass through hundreds of difficulties before succeeding. Those that persevere will see the light, sooner or later. - ***Swami Vivekananda***

సామాజిక జీవితంలోనైనా, ఆధ్యాత్మిక జీవితంలోనైనా లక్ష్యాన్ని సాధించాలంటే అవరోధాల్ని ఎదుర్కోక తప్పదు. ఎదురైన కష్టాలన్నింటినీ అధిగమించాలంటే 'కపీశ్వరుని కార్యదీక్ష' మనకు ఆదర్శం కావాలి. అప్పుడే కార్యసిద్ధి కరతలామలకం అవుతుంది. ❖

అంగవైకల్యమంటే...

-స్వామి సుప్రియానంద

కుంటివాళ్ళు, గుడ్డివాళ్ళు, మూగవాళ్ళు ఇంకా ఇలాగ ఎందరో వికలాంగులు మనకు సమాజంలో కనిపించినప్పుడు మనసు స్పందించడం, మనలో సానుభూతి కలగడం సహజం. దీనికి కారణం ఆ వ్యక్తుల అంగవైకల్యం. ఆ వ్యక్తులే ఘనకార్యాలు 'సాధించినపుడు, ఇది ఎలా సాధ్యం' అని మనం ఆశ్చర్యపోతాం!

సగటు మనిషి ఎప్పుడూ తన తెలివి తేటల్ని ప్రదర్శించ డానికి ప్రయత్నిస్తాడు. అంటే తనను తాను ప్రకటించుకోవడానికి చూస్తాడు. అతనిలో ప్రకటనా సామర్థ్యం (Advertising ability) తప్ప ఆలోచనా సామర్థ్యం (Thinking ability) ఉండదు.

అంగవైకల్యం గల వారు గొప్ప వారు ఎలా కాగలిగారో మనం పరిశీలించినపుడు వారిలోని 'ఆలోచనా సామర్థ్యం' మనకు ప్రస్ఫుటమవుతుంది. దీనిని బట్టి ఆలోచించలేకపోవడం మనిషి యొక్క నిజమైన 'అంగవైకల్యం' అని అర్థమౌతుంది.

తత్త్వవేత్త బెర్ట్రాండ్ రస్సెల్ అంటారు "Most people would rather die than think, infact, they do so!" 'చాలామంది చావనన్నా చస్తారుగాని ఆలోచించరు. నిజానికి వారు చేసేది అదే!'

ప్రపంచంలో చాలామంది తెలివిగలవారు ఉన్నారు. కాని వారందరూ ఆలోచనా పరులా? ఒక తీవ్రవాది చాలా తెలివిగలవాడు. కాని అతను సవ్యంగా ఆలోచించకపోవడంతో అతని ప్రవర్తన వల్ల సమాజంలో కలిగే అరాచకం మనం చూస్తున్నాం! ఇది ఒక తీవ్రవాది విషయంలోనే కాదు, ఇలా ఆలోచనా రాహిత్యం వలన కలిగే అవకతవకలు అనేకం. చెవులు చిల్లులు పడేలా పెద్దపెద్ద లౌడ్ స్పీకర్లు పెట్టి ఒకవైపు 'దేవుడి' పేరుతో, మరొకవైపు 'వినోదం' పేరుతో శబ్దకాలుష్యం చేయడం ఎంత అనాగరికం! ఇది ఒక రకమైన బుద్ధి వైకల్యం కాదా?

ఆలోచనలేని తెలివితేటలు వ్యర్థం అని బాగా అర్థమయ్యే సంఘటన ఒకటి చూద్దాం! ఒకచోట రైలు వంతెన క్రిందుగా వెళుతున్న ట్రక్కు ఇరుక్కుపోయింది. దాని వలన వాహనాల రాక పోకలు స్తంభించిపోయాయి. పెద్ద పెద్ద ఇంజనీర్లు వచ్చి ట్రక్కును బయటకు లాగడానికి ప్రయత్నించారు. కానీ లాభం లేకపోయింది. అప్పుడు జనసమూహం నుండి ఒక పిల్లవాడు ముందుకు వచ్చి ఇంజనీర్లకు ఏదో చెప్పడానికి ప్రయత్నించాడు. వారందరూ పిల్లవాడిని తరిమివేశారు. అయినా ఆ పిల్లవాడు అక్కడనుంచి వెళ్ళకుండా మళ్ళీమళ్ళీ వారి దగ్గరకు వచ్చి ఏదో చెప్పే ప్రయత్నం చేశాడు. వారిలో ఒక పెద్దమనిషి "ఏరా! ఇంత మంది మేధావులు సమస్యతో సతమతమవుతుంటే, నువ్వెందుకు విసిగిస్తున్నావు?" అన్నాడు. అప్పుడు పిల్లవాడు "సార్! నాకు ఒక ఆలోచన వచ్చింది. ట్రక్కు చక్రాలలో ఉన్న గాలి తీసేస్తే దాని ఎత్తు తగ్గుతుంది. అప్పుడు దానిని బయటకు లాగొచ్చు కదా!" అన్నాడు.

ఇప్పుడు మనకు మనం వేసుకోవలసిన ప్రశ్న – We are intelligent, but are we thoughtful? otherwise, thoughtlessness becomes our biggest handicap.

మనం తెలివైనవారమే కానీ చింతనాశీలురమా? ఆలోచనా రాహిత్యమే మనకున్న 'అంగవైకల్యం' ✱

పండుగలు - పర్వదినాలు

మే- 2009

05	మంగళవారం	:	ఏకాదశి
07	గురువారం	:	నృసింహ జయంతి
09	శనివారం	:	బుద్ధపూర్ణిమ
19	మంగళవారం	:	హనుమజ్జయంతి
20	బుధవారం	:	ఏకాదశి

జూన్- 2009

03	బుధవారం	:	ఏకాదశి
19	శుక్రవారం	:	ఏకాదశి
24	బుధవారం	:	పూరీజగన్నాథ రథయాత్ర

శ్రీరామకృష్ణుల హనుమత్ భావన

-స్వామి జ్ఞానదానంద

హనుమంతుడు ప్రదర్శించిన అచంచల దాస్యభక్తి ద్వారానే శ్రీరాముని దర్శనం సాధ్యమని గురుదేవులు గ్రహించారు. అందుచేత తనలో హనుమంతుణ్ణి ఆవాహన చేసుకొన్నారు. ఆ భావంలో లీనమైపోయి కొంతకాలం గడిపారు. అనుక్షణమూ హనుమత్ చింతన, స్మరణ, ధ్యానంలో నెలకొని ఉండడం వల్ల, తనదైన వ్యక్తిత్వాన్నీ, ఉనికినీ గురుదేవులు మరిచిపోయారు. అప్పటి తన స్థితిని గురుదేవులు ఇలా వర్ణించి చెప్పారు- "వానరం మాదిరే గెంతుతూ నడిచేవాణ్ణి. పళ్ళూ, దుంపలూ తప్ప తక్కినవేవీ రుచించేవి కావు. వానరంలా తొక్క తీయకుండానే వాటిని తినేవాణ్ణి. దాదాపు ఎప్పుడూ చెట్ల మీదనే ఉండేవాడిని. అనుక్షణం భక్తితో 'రామ, రామ' అనేవాణ్ణి. వానరంలా నా కళ్ళూ చంచలమయ్యాయి. ఆశ్చర్యం ఏమిటో తెలుసా? వెన్నెముక కింద భాగం ఒక అంగుళం మేరకు పెరిగింది". ఇది విని "అయ్యా! పెరిగిన వెన్నెముక ఇంకా అలాగే ఉందా?" అని ఒక శిష్యుడు అడిగాడు. అందుకు ఆయన నవ్వి, "లేదులే, ఆ భావం మనసు నుంచి పోయిన వెంటనే అది మళ్ళీ మామూలుగా అయిపోయింది" అన్నారు.

ఆలయ కాపలాదారు అయిన హనుమాన్ సింగ్ గొప్ప హనుమద్భక్తుడు, అంతేకాక అతడొక మల్లయుద్ధ వీరుడు. అతనికి తన ఇష్టదైవమైన హనుమంతుని పట్ల ఎంత భక్తిప్రపత్తులున్నాయో అంత భక్తి ప్రపత్తులు గురుదేవుల పట్ల కూడా ఉన్నాయి. ఒక సందర్భంలో మరొక మల్లయుద్ధ వీరుడు దక్షిణేశ్వరానికి వచ్చి, హనుమాన్ సింగ్‌ను సవాలు చేశాడు. అతడు కనుక గెలిస్తే హనుమాన్ సింగ్ ఉద్యోగం అతడికి దక్కుతుంది, పోటీ రోజున హనుమాన్ సింగ్ గురుదేవుల ముందు ప్రణమిల్లి "అయ్యా! మీరు అనుగ్రహిస్తే, నేను మల్లయుద్ధంలో తప్పక గెలుస్తాను" అన్నాడు. గురుదేవుల ఆశీస్సులతో ఆ పోటీలో అతడు నెగ్గాడు. ✸

స్వామి భూతేశానంద
(1901-1998)

ఒకరోజు గంగాధర్ (స్వామి అఖండానంద) మహరాజ్ సర్గాఛీ నుండి బేలూర్ మఠానికి వచ్చారు. ఆయన బేలూర్ మఠానికి వచ్చినప్పుడల్లా నేను ఆయనకు సేవ చేసేవాడిని. గంగాధర్ మహరాజ్ రోజూ ఉదయం ఒక గ్లాసు టీ సేవించేవారు. ఒకరోజు గ్లాసు ఖాళీ కాగానే గ్లాసులో మరికొంత టీ పోశాను. అలా టీ పోయడంలో నా ఉద్దేశం ఏమిటని సూటిగా ప్రశ్నించారు. నేను ఏమాత్రమూ తడబడకుండా, "పరిపూర్ణ నిస్వార్థ సేవ" అని ఠక్కున జవాబిచ్చాను. నా జవాబు విని గంగాధర్ మహరాజ్ ఆహ్లాదంగా నవ్వారు. ❖

ఒకమారు ఎవరో బేలూర్ మఠానికి కొన్ని కొత్త దుప్పట్లు పంపించారు. అప్పటి మఠ కార్యనిర్వాహకులైన ప్రియదా (స్వామి ఆత్మప్రకాశానంద) మహరాజ్ వాటిని తెచ్చి మహాపురుష్(స్వామి శివానంద) మహరాజ్‌కు చూపించారు. మహరాజ్ ఆ దుప్పట్లను చూసి అవి చాలా బాగున్నాయని మెచ్చుకుని, ప్రతి సాధువుకూ ఒక్కొక్క దుప్పటి ఇవ్వమని చెప్పారు. కాని ప్రియదా, అవి పేదలకు పంపిణీ చేయడానికి అని జవాబిచ్చారు. ఆ జవాబు వినగానే మహాపురుష్ మహరాజ్, "ఓహో! సాధువులు ధనికులన్న మాట!" అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అది విని అక్కడ ఉన్న సాధువులందరూ బిగ్గరగా నవ్వారు. ❖

(స్వామి భూతేశానందజీ మహరాజ్ స్మృతులు-
'రసబోధ' పుస్తకం నుంచి)

అంతర్వేది పుణ్యధామం

-ఎన్. శ్రీరామమూర్తి

గోదావరీ నది పాయలలో ఒకటైన వశిష్ట పాయ సముద్రంలో కలిసే స్థలంలో ఉన్న అంతర్వేది గొప్ప నారసింహ క్షేత్రం. ఇక్కడ గోదావరి ఒడ్డున శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి గుడి ఉంది. సముద్రంలో తిరిగే ఓడలు తరచూ అగ్నిప్రమాదాలకు గురి అవుతుండడం వల్ల మొగల్తూరు రాజావారు ఇక్కడ నారసింహ యంత్ర ప్రతిష్ఠ చేయించి ఆలయాన్ని నిర్మించారని చెబుతారు. శ్రీనాథుని రచన 'భీమఖండం'లో ఈ క్షేత్ర ప్రస్తావన ఉంది.

క్రీ.శ. 1582 ప్రాంతంలో స్వామి వారి సుదర్శన చక్రం సముద్రపు ఉప్పెనలో కొట్టుకొని పోయింది. అప్పుడు పేరూరు నివాసి అయిన అంతర్వేది చయనులనే బ్రాహ్మణుడు 11 రోజుల పాటు జపం చెయ్యగా చక్రం ఒడ్డుకు కొట్టుకు వచ్చింది. అప్పటి నుండీ స్వామి వారి కల్యాణ సమయంలో పేరూరు వారిని ఆడ పెళ్ళివారిగా పరిగణించడం ఆచారంగా వస్తోంది.

పూర్వం హిరణ్యాక్షుని కుమారుడైన రక్తలోచనుడనే రాక్షసుడితో స్వామి యుద్ధం చేశాడు. రక్తలోచనుని రక్తపు చుక్క భూమి మీద పడితే మరొక రక్తలోచనుడు పుట్టుకు వస్తాడు. అందువల్ల స్వామి సోదరి అశ్వరూఢాంబ (గుఱ్ఱాలక్క) వచ్చి తన నాలుకను పెంచి, యుద్ధభూమిపై పరచింది. దాంతో రక్తలోచనుని రక్తం నేల మీద పడలేదు. ఆ తరువాత స్వామి ఆ రాక్షసుణ్ణి వధించడం సులభమైంది. రాక్షసవధ జరిగాక గుఱ్ఱాలక్క తన నాలుక పైనున్న రక్తాన్ని ఒక పక్కకు వదిలింది. ఆ రక్తపు కాలువనే నేడు రక్తకుల్య అంటున్నారు.

బ్రహ్మ ఇక్కడ యజ్ఞం చేసి (అంతర్వేది) నీలకంఠేశ్వరుణ్ణి ప్రతిష్ఠ చేశాడు. ✸ **(మే7న నృసింహ స్వామి జయంతి)**

పదకవితా పితామహుడు

- జి. సతీష్

తెలుగు సాహిత్యంలో 'పదకవితా పితామహుడి'గా ప్రసిద్ధి కెక్కిన అన్నమయ్య నారాయణసూరి-లక్కమాంబ దంపతులకు శ్రీసర్వధారి నామ సంవత్సర వైశాఖ పౌర్ణమి (క్రీ.శ.1408 మే 9) నాడు కడప జిల్లాలోని తాళ్ళపాక గ్రామంలో జన్మించాడు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లుగా పసితనం నుండే అన్నమయ్య తిరుమలేశుని భక్తుడు. 8 ఏళ్ళ వయస్సులోనే కొండ ఎక్కుతూ అశువుగా 'మంగాంబికా శతకం' పాడాడు. కొండపైకి చేరి స్వామినీ, ఇతర దేవీదేవతలనూ దర్శిస్తూ 'వేంకటేశ శతకం' పాడాడు.

టంగుటూరుని ఏలుతున్న సాళువ నరసింగరాయుడు అన్నమాచార్యుని గొప్పదనం, అతనికి గల ఆధ్యాత్మిక శక్తి గురించి తెలిసి, తన ఆస్థానంలో గురువుగా ఉండమని కోరాడు. అన్నమయ్య అందుకు అంగీకరించాడు. ఒకరోజు అన్నమాచార్య పాడిన మధుర భక్తికి సంబంధించిన పాట విన్న రాజుగారు తన్మయుడై అదే విధమైన పాట ఒకటి తనను (రాజును) స్తుతిస్తూ పాడాల్సిందిగా కోరాడు. తాను భగవంతుడి వైభవాన్ని చాటే పాటలే తప్ప మానవ మాత్రులను పొగడననడంతో రాజు అహం దెబ్బతింది. పట్టరాని కోపం వచ్చింది. వెంటనే అన్నమయ్యను గొలుసులతో బంధించి కారాగారంలో పెట్టించాడు. శ్రీ వెంకటేశ్వర స్వామిని తలచుకుంటూ ఒక పాట పాడాడు. వెంటనే గొలుసులు తెగిపోయాయి. రాజు తనను క్షమించాల్సిందిగా అన్నమయ్యను వేడుకొన్నాడు. భక్తులను అవమానించడం తగని పని అని రాజుకు సలహా ఇచ్చి సంకీర్తనల ద్వారా భగవంతుడి మహిమలను చాటి చెప్పడానికి తిరుపతి వెళ్ళిపోయాడు అన్నమయ్య.

అన్నమయ్య తన జీవితకాలం (95 ఏళ్ళు)లో 32,000 సంకీర్తనలు రచించి పాడగా, నేడు14,000 సంకీర్తనలే లభ్యమవుతున్నాయి. అన్నమయ్య తాళపత్రాల మీద వ్రాసిన ఆ సంకీర్తనలను ఆయన కుమారుడు తిరుమలాచార్య రాగి రేకులపైన చెక్కించాడు. ✸ **(మే9న అన్నమాచార్య జయంతి)**

పరమేశ్వరుని పరిరక్షణలో ...
స్వామి జపానంద స్వీయ అనుభవాలు -23

ఆకల్ని తీర్చిన ఆనందం !

యమునోత్రికి వెళ్ళే మార్గంలో బాటకు కొంచెం మీదుగా మంచుతో కప్పబడి కొండల మధ్య ప్రకృతి సౌందర్యంతో నిండిన ఒక గ్రామం ఉంది. స్వామి జపానంద ఆ గ్రామానికి వచ్చారు. మధ్యాహ్నం అయింది, చాలా ఆకలిగా ఉంది. ముందురోజు కూడా తినడానికి ఏమీ దొరకలేదు. కానీ గ్రామంలో మనుష్య సంచారమే లేదు. "ఆవులు, గేదెలు, కుక్కలు తిరుగుతున్నాయి, అంటే గ్రామంలో మనుష్యులు నివసిస్తున్నారు" అని అనుకుని ముందుకు వెళ్ళారు. ఒక ఇంటి వసారాలో ఒక వృద్ధురాలు కూర్చుని కదురుతో ఊలు తీస్తున్నది. సాధువును చూడగానే ఆమె సాదరంగా ఆహ్వానించి ఆసనం చూపింది. "ఇవాళ మీరు మా ఇంటికి రావడం మా భాగ్యం. మీరు మా ఇంట్లో భిక్ష స్వీకరించి వెళ్ళాలి. ఇంట్లో అందరూ గడ్డి విత్తనాలు ఏరుకోవడానికి అడవిలోకి ఉదయమే వెళ్ళారు. అందరూ సాయంత్రం ఇంటికి వచ్చి వంట చేస్తారు. అప్పుడు మీరు రొట్టెలు తిని వెళుదురు గాని! రెండు సంవత్సరాలుగా పంటలు లేవు. ఏం చేస్తాం" అని ఆమె అంది.

ఇంతలో ఒక వృద్ధుడు వచ్చాడు. అతను గ్రామ పెద్ద. స్వామికి నమస్కారం చేసి "మహరాజ్! మా ఇంటికి రండి. వాళ్ళింట్లో ఎవరూ లేరు. స్త్రీలందరూ గడ్డి విత్తనాలు ఏరుకోవడానికి అడవికి వెళ్ళారు. పురుషులందరూ కూలీ పని చేసుకోవడానికి ముస్సోరీ, డెహరాడూన్ వెళ్ళారు. మా ఇంట్లో రొట్టెలు తయారుగా ఉన్నాయి. భిక్ష తీసుకొని కాస్త విశ్రాంతి తీసుకొందురుగాని రండి" అని పిలిచాడు.

వృద్ధురాలు అందుకు అంగీకరించలేదు. "ఇంటికి వచ్చిన సాధువు ఏమీ తినకుండా వెళితే మాకు అశుభం కలుగుతుంది. సాయంత్రం నా కూతుళ్ళు, కోడళ్ళు వచ్చి వంట చేస్తారు. భోజనం చేసి వెళ్ళండి"అని ఆ వృద్ధురాలు సాధువుని బ్రతిమలాడింది.

గ్రామ పెద్ద "సాధువును ఆకలితో ఉంచకూడదు. మనమందరం ఒక్కటే కదా" అని ఎంతో చెప్పి చూశాడు. నిజమే కానీ ఇంటికి వచ్చిన సాధువు ఏమీ తీసుకోకుండా వెళ్ళడం ఏమీ బాగా లేదు. అంటూ లోపలికి వెళ్ళి, ఇల్లంతా వెతికి చిన్న బెల్లం ముక్క తీసుకువచ్చి, "మహారాజ్! మీకివ్వడానికి ఇంకేమీ లేదు. ఇదే తీసుకోండి" అని చేతులు జోడించింది. స్వామి ప్రేమతో దాన్ని తీసుకుని ఆమెను ఆశీర్వదించి, గ్రామ పెద్దతో కలిసి వాళ్ళ ఇంటికి వెళ్ళారు. గ్రామ పెద్ద ఒక ఆకులో అతనికి నాలుగు చిన్న చిన్న రొట్టెలు తెచ్చి ఇచ్చి, "మహారాజ్! ఇప్పటికి ఇది తినండి, రాత్రికి అడవి నుంచి మా ఇంటి స్త్రీలందరూ వచ్చాక వంట చేస్తారు" అన్నారు.

రొట్టెల రంగు ఆకుపచ్చగా ఉంది. వాటిని చూసి, సన్యాసి భయపడి గ్రామపెద్దతో "అయ్యా! నేను ఊరి బయటి వాగు దగ్గర కెళ్ళి తింటాను" అని చెప్పి, వాటిని తీసుకుని కొండ వాగు దగ్గరకొచ్చి ఒక ముక్క తుంచి నోట్లో పెట్టుకున్నారు. క్వినైన్‌లా చేదుగా ఉంది. అసలు తినలేకపోయారు. వాంతి వచ్చేలా ఉంది. కానీ, "సన్యాసి రుచి అని అనుకుంటే ఎలా? ఇది తినే ఇక్కడ మనుష్యులు ప్రాణాలతో ఉన్నారు. ఇది దొరకడమే మహాభాగ్యం. భిక్షలో స్వీకరించిన పదార్థాన్ని పారవెయ్యకూడదు" అని తనకు తాను నచ్చజెప్పుకొన్నారు. రొట్టె ముక్కను తినబోతుండగా ఆయన దృష్టి అక్కడకు కొంచెం దూరంగా కూర్చొని ఉన్న బాలుడి మీద పడింది. ఆ బాలుడు ఒక అస్థిపంజరంలా ఉన్నాడు. తిండి తిని ఎన్ని రోజులైందో, ఆ బాలుడి దృష్టి అంతా సన్యాసి చేతిలో ఉన్న రొట్టెలు మీదే ఉంది.

సన్యాసి అతణ్ణి చేతితో సైగ చేసి పిలిచారు. ఒక్క గంతులో వచ్చి సన్యాసి ఇచ్చిన రొట్టెల్ని మిఠాయి తిన్నట్లు సంతోషంగా తిన్నాడు. ఆకలితో ఉన్న బాలుడికి ఆహారం ఇచ్చాననే తృప్తి సన్యాసి ఆకలిని తీర్చింది, ఆనందాన్ని మిగిల్చింది. ✸

అనువాదం : శ్రీమతి జి.ఎస్. లక్ష్మి

దేవీ వైభవం

ప్రవచనం: శ్రీ సామవేదం షణ్ముఖశర్మ   విలేఖనం: శ్రీమతి ఎన్. శేషు

(...గత సంచిక తరువాయి)

"విపంచ్యా గాయంతీ వివిధమపదానం పశుపతేః
త్వయారబ్ధే వక్తుం, చలితశిరసా సాధువచనే"

"విపంచ్యా గాయంతీ వివిధమపదానం పశుపతేః" ... సరస్వతీ దేవి కచ్ఛపీ వీణను మీటుతూ అమ్మ వారికి సంగీతం వినిపిస్తున్నది. సరస్వతి కూడా అమ్మ యొక్క శక్తే; అమ్మ నుండే ఆవిర్భవించింది. అమ్మ నుంచి వచ్చిన సరస్వతే అమ్మకు వినోదం కలిగించగలదు. మణిద్వీపంలో అమ్మవారి కోసమని సరస్వతీదేవి కచ్చేరీ చేస్తోందట. ఆమె వీణ అయిన కచ్ఛపికి ఒక ప్రత్యేకత ఉన్నదట. నాదంలో స్వరాలతో పాటు అక్షరాల సంపుటి కూడా వినిపించగలదు - అది దాని ప్రత్యేకత. అంటే ఆ తల్లి స్వరాలతో పాటు అక్షర శక్తుల్ని కూడా ఆవిష్కరింప చేస్తుందట తన వీణతో! ఏదో ఒక పాట పాడితే జగజ్జనని కామేశ్వరీదేవి సంతోషించదు. ఆమెకు ఇష్టమైన పాట... వివిధమపదానం పశుపతేః - అంటే శివుని లీలలు గానం చేస్తోంది. ఆ తల్లికి అదే ఇష్టం. అంటే సంగీతాలైనా, సాహిత్యాలైనా శివమయం కావాలి; శివేతరం చెప్పకూడదు. కావ్యం శివేతరాల్ని పోగొట్టాలి. ఏది శివుడో అదే ఇవ్వాలి కావ్యాలు, అదే ఇవ్వాలి సంగీతం, శివమయమైనవే సంగీత సాహిత్యాలు అంటే మంగళకరమైనవి. సరస్వతీ దేవి శివుని చరిత్రను గానం చేస్తుండగా వింటూ వింటూ అమ్మవారు "సాధు" అన్నారట; సాధు అంటే బాగుంది అని. ఈ మాట వీణానాదం కన్నా చాలా బాగుందట. దానితో సరస్వతీ దేవి తన వీణ అమ్మ పలుకు దగ్గర ఓడిపోయింది అనుకుని తనపైనున్న పయ్యదని వీణపై కప్పారట. అమ్మవారు తనపై ఉన్న బట్టను వీణపై కప్పారట. అదే "నిజ సల్లాప మాధుర్య వినిర్భర్త్సిత కచ్ఛపి" అన్న మాటను శంకరుల వారు అంత అద్భుతంగా భావించారట.

"గిరిశ చరితే విస్మయవతీ" అన్నారు. అయ్యవారి చరిత్ర చెబితే అంత అద్భుతమా అంటూ ఆనందంగా వింటారట. అయ్యవారంటే అమ్మ వారికి అంత ప్రేమ. ఆ ప్రేమ గురించి తలచుకోవడమే చాలా గొప్పది. దీనినే సమయాచారం అన్నారు. సమయాచారం అంటే శివశక్తుల్ని ఏకంగా దర్శించి ఉపాసించడం. సమయం అంటే సామ్యం అని అర్థం. ఒకరిలో ఉన్న సమత్వం తెలిసి ఆరాధించడం. ఆ ఆరాధన అమ్మవారికి చాలా ఇష్టం. "సమయాచార తత్పర" అనడంలో అంతరార్థం అది. ఈ సమయాచార సంప్రదాయాన్ని అనుసరించి శంకరులు సౌందర్య లహరి రచించారు. శివశక్తుల ఏకం 'సౌందర్యలహరి'లో మొదటి శ్లోకం నుంచీ చూపిస్తారు. 'శివశ్శక్త్యాయుక్తో' అంటే శివుడు శక్తితో కలసి ఉన్నప్పుడు అని. సౌందర్యలహరిలో ఇది మొదటి మాట; అదే లలితా సహస్రంలో చివరిమాట- 'శివ శక్త్యైక్య రూపిణి' అన్నది. సౌందర్యలహరి సారం అంతా చూపడానికి శివఃశక్త్యాయుక్తః అన్న ఒక్క శబ్దం చాలు. మనం శివఃశక్త్యాయుక్తః అని తలచుకున్నప్పుడు లోకక్షేమం అవుతుంది, మనకీ క్షేమం కలుగుతుంది.

శంకరుల వారు శివ శక్త్యైక్య రూపిణీ అనే లలితా సహస్రపు ఆఖరి మాటను ప్రతిపాదిస్తూ ఒక అద్భుతమైన భావన చేశారు. శివ శక్త్యైక్య రూపిణి అనే మాటను మనం అర్థం చేసుకుంటే ఆ రూపంలో ఎక్కడైనా శివుడు కనిపిస్తున్నాడా! కామాక్షీ అమ్మవారి ఎదురుగా కూర్చుంటే అందులో శివుని రూపం ఏది?... అంతా శక్తిరూపమే. కానీ శంకరుల వారు మాత్రం అమ్మా శివశక్తి రూపిణివి నువ్వు అన్నారు. ఎలా కనపడ్డా శివశక్తి రూపమే; ఆయన లేకుండా నువ్వు కనిపించవు, నువ్వు లేకుండా ఆయన రూపం కనిపించదు. ఏ రూపంలో కనిపించినా మీరిద్దరూ కలిసే కనిపిస్తారు అన్నారు. ఇదంతా పెద్ద రహస్యం. దాన్ని మనం కవితా చమత్కారం కింద భావిస్తాం. ఇవి భక్తులు తమ సమాధి స్థితిలో భావించిన దివ్యానుభవాలు.

త్వయా హృత్వా వామం వపురపరితృప్తేన మనసా
శరీరార్థం శంభో రపరమపి శంకే హృతమభూత్,
యదేతత్త్వద్రూపం సకలమరుణాభం త్రినయనం
కుచాభ్యామానమ్రం కుటిలశశి చూడాలమకుటమ్.

అమ్మ 'శివ శక్త్యైక్య రూపిణీ' అనగానే మనకు అర్ధనారీశ్వర స్వరూపం కనిపిస్తుంది. ఆయన తెల్లగా ఉంటారు, అమ్మవారు ఎర్రగా ఉంటారు. సగం తెలుపు, సగం ఎరుపు కనపడాలి, కానీ అమ్మ రూపం మొత్తం ఎర్రగా కనిపిస్తోంది. అప్పుడు అయ్యవారు ఎక్కడ ఉన్నట్లు అంటే ఎంత చక్కగా భావన చేశారో చూడండి! ఈ శ్లోకాన్ని భావించడం చేతనైతే ఒక దివ్యానుభూతి లభిస్తుంది. అదేమిటంటే అమ్మవారికి అయ్యవారు సగం ఇచ్చారట. అది ఎలా ఇచ్చారో శివ కల్యాణంలో చూపిస్తారు. "క్రీతోస్మి తవ తపోభిః" – నీ తపస్సుతో నన్ను కొనేశావు అని! "అద్య ప్రభృతి తే దాసః" అని చెప్పి సగం ఇచ్చేశారట. సగం ఇస్తే – నువ్వు సగం ఇచ్చావు కానీ నేను సగంతో తృప్తి పడను అన్నారట (అమ్మవారు). అప్పుడు – 'త్వయా హృత్వా వామం' – సగం తీసుకున్నా, 'వపుః అపరితృప్తేన మనసా' – మనస్సు తృప్తి చెందక నెమ్మదిగా మిగిలిన సగం కూడా నువ్వు దోచుకున్నావు అన్నారు. అంటే భర్త ఇచ్చే ప్రేమలో భార్యకు ఇంక చాలు అనే సంతృప్తి ఉండదు. ఇంకా ప్రేమ కావాలి అనే తపన ఆమెకు ఉంటుంది; ఎందుకంటే ఆయన మీద అంత ప్రేమ ఉంది కనుక. ఆయన పేరే హరుడు, అందరినీ హరించేవాడు ఆయన అయితే ఆయనను హరించేది ఆవిడ.

వేదం ఇద్దరు దొంగలను చెప్పింది. ఒకరు హరుడు, ఇంకొకరు హరి. ఈ దొంగలే మనకి దేవుళ్ళు. అందుకే "తస్కరాణాం పతయే నమః సేనానాం పతయే నమః స్తాయూనాం పతయే నమః" అని రుద్ర నమకంలో మనం స్తోత్రం చేస్తాం. వాళ్ళిద్దరూ దొంగలు. ఎందుకంటే ఇంత జగతిలో ఎన్నో మనకు కనబడకుండానే అలా మాయం చేసేస్తుంటారు. కనిపిస్తున్న వస్తువునే అలా దాచి పెట్టేస్తారు. ఈ దొంగల్ని మనం ఆశ్రయిస్తే, మనది కాదని దేన్ని పేర్చుకున్నామో అదంతా దోచి మనల్ని మిగుల్చుతారు. అందుకు ఆ దొంగల్ని మనం ఆశ్రయించాలి. అయితే ఆయన హరుడు, ఈయన హరి. గుడి మారిందే తప్ప తత్త్వమేమీ మారలేదు. ఈవిడ వాళ్ళను మించి పోయింది, ఏకంగా ఆయన్నే దోచుకుంది. ''త్వయా హృత్వా వామం వపురపరితృప్తేన మనసా శరీరార్ధం శంభో రపరమపి శంకే హృతమభూత్" – నువ్వు క్రమంగా మిగిలిన సగం కూడా దోచేసుకున్నావు అన్నారు. తెలుపు మీద ఎరుపు ఆక్రమిస్తే, తెలుపు మరి కనపడదు. అందుకు ఈవిడ మొత్తం ఆక్రమించి ఆయనను కప్పేసింది. "మిగిలిన సగాన్ని నేను దోచుకోలేదు అని నువ్వు చెప్పినా నేను నమ్మను అమ్మా, ఎందుకంటే నీలో ఆయన ఉన్నారని నీ రూపమే నాకు చెబుతోంది" అన్నారు. అది ఎలాగంటే "త్రినయనం కుటిలశశి చూడాలమకుటమ్" అన్నారు. ఆ మూడు నేత్రాలు, సిగ పైన నెలవంక ఆయనవే! అవి చెబితే ఆయనే గుర్తొస్తారు. ఎప్పుడైతే ఆ రెండూ కనిపిస్తున్నాయో అది శివస్వరూపం. శివ స్వరూపాన్ని దోచుకున్నావనడంలో నీ రూపంలో కనిపిస్తున్న చంద్రలేఖ, మూడు నేత్రాలు కూడా నువ్వు అయ్యను తీసుకున్నావు. అయ్య నీలోనే ఉన్నాడని తెలుస్తోంది. మొత్తం అయ్యే అనుకుందామా అంటే నీ మాతృత్వ లక్షణంతో కూడిన రూపం కనిపిస్తున్నది. అది – 'సకలమరుణాభం త్రినయనం కుచాభ్యామానమ్రం కుటిలశశి చూడాలమకుటమ్' ఆ రెండు (పద్య) పాదములలో మొదటి భాగం అమ్మ, రెండవ భాగం అయ్య. అలా సామరస్యాన్ని చూపిస్తున్నారు. – "ఏతద్వత్ రూపం సకల మరుణాభం" మొత్తం అరుణం కనిపిస్తోంది; కనుక నువ్వు అక్కడ ఉన్నావు. ఇక "కుచాభ్యామానమ్రం"... "కుచోన్నతే కుంకుమ రాగశోణే..." సకల జగత్తునూ పోషించే మాతృత్వ చిహ్నం అయిన ఆ దివ్యమైన వక్షఃస్థలంతో నువ్వు శోభిల్లుతూ ఉంటే శక్తివి – అమ్మవి – నువ్వు అక్కడ ఉన్నావని తెలుస్తోంది అన్నారు; కనుక అమ్మ లక్షణం అయ్య లక్షణం ఈ రెండూ నీ రూపంలో కనిపిస్తున్నాయి, ఇది శివ శక్త్యైక్య రూపిణి. ❖

సశేషం

ప్రియ, అప్రియాలకు మూలం మనస్సు

శ్రీరాముడు: ఈ మనసులో దుర్భావాలు ఎందుకు వస్తాయి?

శ్రీవసిష్ఠ మహర్షి: ప్రబలమైన వాసనలే ఈ జీవుని మోహానికి కారణం.

ఈ సంసారవనంలో మనస్సు అనే మృగం వాసనాజాలం చేత ఈడ్వబడుతోంది. ఫలితంగా అనేక దుఃఖాలను మళ్ళీ మళ్ళీ అనుభవిస్తోంది. ఎవరిలో తత్త్వవిచారణ దృఢత్వాల వల్ల పదార్థాల పట్ల "ఇవి నాకు కలగాలి, ఇవి తొలగాలి"... అనే వాసన (లేక) అభినివేశం నశించిపోతుందో, వారికి జ్ఞానం అత్యంత సులభంగా లభిస్తోంది. మేఘాలు తొలగితే ఆకాశంలో సూర్యుని ప్రకాశం స్వయంగానే ద్యోతకమవుతున్నట్లు "ఏదో పాలించాలి" అనేది విడిచిపెట్టగానే జ్ఞానం ఈ జీవునిలో ప్రకాశిస్తోంది. జ్ఞానమే ఈ జీవుని నిజమైన స్వరూపం, స్వభావం.

ఓ ప్రియ రాఘవా! మనస్సే జీవుడు. అంతేకానీ, ఈ తుచ్ఛమైన దేహం జీవుడు కాదు సుమా! ఎందుకంటావా? ఈ దేహం జడమైనది. ఇక దీనిలోని మనస్సు మాత్రం జడమో, చేతనమో కాక, ఈ రెండింటికీ విలక్షణంగా ఉంటోంది. ఈ మనస్సు ఏ పని చేస్తుందో, అదే వాస్తవంగా ఈ జీవుడు చేస్తాడు. మనసు దేనిని త్యజిస్తుందో, దాన్ని మాత్రమే జీవుడు త్యజిస్తాడు. ఈ భూమండలం, ఆకాశం, వాయువు, మహత్తు... ఇవన్నీ మనస్సు మాత్రమే. ఈ మనస్సు కనుక ఆయా పదార్థాలలో భావన చేయడం జరగకపోతే ఆ యా పదార్థాల ఉనికి అనుభవంలోకి రాదు.

ఎవరి మనస్సైతే అజ్ఞానాన్ని ఆశ్రయిస్తుందో, అట్టివాడు "మూఢుడు" అనీ, అదే మనస్సు వివేకాన్ని ఆశ్రయించినప్పుడు "జ్ఞానయుక్తుడు" అనీ అంటున్నారు. అంతేకానీ ఈ జడ శరీరాన్ని దృష్టిలో పెట్టుకొని, "ఇతడు జ్ఞాని. ఇతడు మూఢుడు" అంటామా? అనలేం.

అలాగే ఎదురుగా ఉన్న దానిని చూసేది మనస్సే కానీ ఈ కనుగుడ్లు కానే కావు. ఆ మనస్సే వినడం అనే పని చేసే చోటును 'చెవులు' అనీ, స్పర్శను పొందే చోటును 'చర్మం' అనీ, సువాసన ఆస్వాదించే చోటును 'ఘ్రాణేంద్రియం' (ముక్కు) అనీ, రుచి చూసే స్థానాన్ని 'నాలుక' అనీ అంటున్నాం. ఆ యా వృత్తులలో ప్రవర్తిస్తున్నట్టి ఈ మనస్సు శక్తి అతి విచిత్రమైనది. మనస్సు లేకపోతే ఇంద్రియాల ఉనికే లేదు. కవిత్వం అల్లుతున్నది కవియే గాని, కలం కాదు కదా! మనస్సే ఇంద్రియాలలో ప్రవేశించి ఆ యా అనుభవాలను రచిస్తోంది.

ఒకే నటుడు అనేక వేషాలు వేస్తూ ఉంటాడు. ఆ వేషాలన్నీ అతడే... కానీ అతను ఆ వేషాలన్నిటికీ విలక్షణంగా ఉంటున్నాడు కదా! అలాగే ఒక వ్యక్తి తండ్రి, తాత, తమ్ముడు, అన్న, కొడుకు, స్నేహితుడు మొదలైనవన్నీ అవుతున్నాడు. అన్నీ అతడే! కానీ అతడు వాటిలో ఒకటి నుంచి మరొకటిగా పరిణమిస్తున్నాడా? లేదే!

ఈ మనస్సు కూడా అన్ని ఇంద్రియాలలోనూ వేరు వేరుగా వర్తిస్తోంది. అందులో ఏ ఒక్కటీ తాను కాకుండా ఉంటోంది. దీనికి వేరుగా ఇంద్రియాలకు అస్తిత్వమే లేదు. ఇది అల్పమైన దాన్ని అధికంగానూ, అధికమైనదాన్ని అల్పంగానూ చెయ్యగలదు. మన మిత్రుల తప్పులు స్వల్పమైనవిగా, శత్రువుల తప్పులు తీవ్రమైనవిగా కనిపించడమే ఇందుకు తార్కాణం. సత్యాన్ని అసత్యంగా, అసత్యాన్ని సత్యంగా దర్శించడంలో ఈ మనస్సుకున్న శక్తి మరిక దేనికీ లేదు కదా! ఇది చేదు వస్తువును కూడా మధురంగా భావిస్తే, అట్టి మధురానుభవంగానే పొందగలదు.

ఈ చిత్తం దేనిలో ఏ వృత్తితో ప్రతిభాసిస్తుందో, ఆ వస్తువు అలాగే పరిణమిస్తుంది. "ఇది నాకు ప్రియం" అనే వృత్తితో అది దర్శిస్తున్నప్పుడు, ఆ వస్తువు అలాగే ప్రియమై ప్రాప్తిస్తోంది. ఇలాంటి భావన వల్లనే, వ్యాకులచిత్తుడైన హరిశ్చంద్రుడు ఒకే రాత్రి కొద్ది గంటల కాలంలో పన్నెండు సంవత్సరాల సుదీర్ఘమైన అనుభవం అత్యంత వాస్తవానుభవంలా స్వప్నంలో పొందాడు. మనస్సు వైచిత్ర్యం అది.

దారం తెగిపోతే పూలదండలో ఉన్న పూలన్నీ నేల రాలుతాయి కదా! మనసును జయిస్తే చాలు, ఇక తక్కిన ఇంద్రియాలన్నీ తమంతట తామే అప్రభావితం అవుతాయి. అలాంటి స్థితిలో మనస్సు సుఖదుఃఖాలకూ, ప్రియాప్రియాలకూ అతీతంగా ఉంటుంది. ❖

('శ్రీవసిష్ఠ రామ సంవాదం' – ఉత్పత్తి ప్రకరణం ఉత్తరార్థం నుంచి) **అనువాదం : వై. హెచ్. రామకృష్ణ**

ధీరవాణి

- స్వామి వివేకానంద

మహోన్నత కర్మయోగి!

గౌతముడనే మహాపురుషుడు బౌద్ధమతాన్ని స్థాపించాడు. పరతత్త్వాన్ని గురించిన చర్చ అప్పుడు తీవ్రంగా జరుగుతుండేది. పరతత్త్వం, దేవుడు– వీటిని గురించిన సిద్ధాంతాల విషయమై అతడు పూర్తిగా ఉపేక్షవహించాడు. దేవుడున్నాడా? అని అతణ్ణి పలు మార్లు ప్రశ్నించారు. తనకు తెలియదని అతడు చెబుతూ వచ్చాడు. సద్వర్తనాన్ని గురించి అడిగినప్పుడు "పుణ్యకార్యాలు చేస్తుండండి. సద్భావంతోనే వుండండి" అనేవాడు. ఒకనాడు అతడి వద్దకు ఐదుగురు బ్రాహ్మణులు వచ్చి తమ వివాదాన్ని పరిష్కరించమని కోరారు. వాళ్ళలో ఒకడు, "దేవుడు ఇలాంటివాడు, అలాంటి వాడు, అతణ్ణి పొందటానికి మార్గం ఇదనీ నా గ్రంథం అంటోంది" అన్నాడు. మరొకడు లేచి, "ఆర్యా! అది బొత్తిగా తప్పు. నా గ్రంథం ఇలా అంటోంది. భగవంతుడు ఫలానా లక్షణాలు గలవాడు. అతణ్ణి పొందేమార్గం ఇది" అన్నాడు. అదేవిధంగా తక్కినవారు కూడా చెప్పారు. వారంతా చెప్పింది బుద్ధుడు సావధానంగా ఆలకించి, ఒక్కొక్కరినీ ఈ విధంగా అడిగాడు: "దేవుడు ఆగ్రహిస్తాడని, ఎవరినైనా ఎప్పుడైనా హింసిస్తాడని, అతడు అపవిత్రుడని ఏ గ్రంథాలైనా చెబుతున్నాయా?" "లేదు స్వామీ! అతడు పవిత్రుడని, మంగళస్వరూపుడని గ్రంథాలన్నీ నొక్కి చెబుతున్నాయి" అని వారన్నారు. "ఐతే మీరు పరిశుద్ధులు, సాధుశీలురు కారాదా? అప్పుడే భగవంతుడు ఎలాంటివాడో తెలుసుకోగలుగుతారు" అంటూ బుద్ధుడు హితవు చెప్పాడు.

బుద్ధుడు చెప్పిందేమిటి? "నీ కెవరూ సహాయపడరు; నీకు నువ్వే తోడ్పడాలి. నీ మోక్షాన్ని నువ్వే సంపాదించుకోవాలి." తనను గురించి అతడన్న మాటలివి: "బుద్ధడనే పదం అనంతమైన జ్ఞానానికి పేరు. అది ఆకాశం మాదిరి అనంతం. గౌతముణ్ణి అయిన నేను ఆ స్థితిని పొందాను; సాధనచేస్తే మీరూ ఆ స్థితిని పొందగలరు." కోర్కెలను పూర్తిగా పరిత్యజించండి. బుద్ధుడు స్వర్గానికి పోవాలని ఆశించలేదు; ధనాన్ని ఆశించలేదు; సమస్తాన్నీ త్యజించి భిక్షాటనం చేస్తూ, సకల ప్రాణుల మేలుకై బోధచేసిన విశాల హృదయుడు ఆయన. అతడొక సారి ఒక రాజుతో ఇలా అన్నాడు: "గొర్రెపిల్లను బలి ఇవ్వటంవల్ల నీకు స్వర్గం లభించేపక్షంలో, మానవుణ్ణి బలియిస్తే అంతకంటే ఎక్కువే లభిస్తుంది కదా! కాబట్టి నన్ను బలియివ్వు." రాజునిర్ఘాంతపోయాడు. నిర్దుష్టం, పరిపూర్ణం అయిన క్రియాశీలానికి నిదర్శనం బుద్ధుడు. అతడు పొందిన మహోన్నత స్థాయినిబట్టి మనం కూడా కర్మమార్గంలో ఆధ్యాత్మిక పరిపూర్ణత్వాన్ని పొందగలమని స్పష్టమవుతోంది.

భగవంతుడిపై విశ్వాసం ఉంటే, ఈ మార్గం అనేకులకు సులభతరమవుతుంది. దేవుడిపై నమ్మకం లేకపోయినా, తత్త్వసిద్ధాంతం లేకపోయినా, ఏ మతశాఖకూ చెందకపోయినా, చర్చికిగాని, దేవాలయానికిగాని వెళ్ళకపోయినా, భౌతికవాదినని చెప్పుకొన్నా పరమపదాన్ని పొందడం ఎవరికైనా సాధ్యమని బుద్ధుని జీవితాన్నిబట్టి తేటతెల్లమవుతుంది. అతన్ని విమర్శించటానికి మనకు అధికారంలేదు. బుద్ధుడి హృదయం–లవలేశమైనా నాకుంటే ఎంత బాగుంటుందో అని అనిపిస్తుంది. ఇతరులు భక్తి, యోగ, జ్ఞానమార్గాల్లో ఏ పరమోన్నత స్థితిని పొందారో, బుద్ధుడూ ఆ స్థితిని పొందాడు. పరిపూర్ణత్వం నిష్కామకర్మవల్ల సాధ్యమని నిరూపించిన మహోన్నత కర్మయోగి బుద్ధుడు. ❖

పరిప్రశ్న

- స్వామి మేధానంద పురి

– కె. శేషప్ప

? : ఇరవై ఏళ్ళుగా సాధన చేస్తున్నాను. కానీ మనోవాసనలను జయింపలేకున్నాను?

✍: ప్రతి మనిషికీ ఆరు జన్మల వాసనలు మనసులో నిల్వ ఉంటాయి. క్రిందటి 7వ జన్మలోని వాసనలు ప్రారబ్ధంగా మారి ఈ జన్మలో అనుభవిస్తాడు. లేక పూర్వ వాసనలలో ఫలాన్నివ్వడానికి సిద్ధంగా ఉన్న సంస్కారాల వల్ల ఈ జన్మ కలుగుతుంది. ఇదంతా పురాణాల ఆధారంతో చెప్పింది. దీనినే "ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్" అని గీతలో (2-55) అన్నారు. కనుక వివేక, వైరాగ్య ఏకాగ్రతలు కలగడానికి మనసులో ఉన్న అన్ని వాసనలూ క్షయం అవాలి.

ఉదాహరణకు ఒకపెద్ద బండరాయిని సుత్తితో బ్రద్దలు కొట్టే వ్యక్తి నలభై దెబ్బలు కొట్టిన తరువాత రాయి పగులుతుంది. నలభయ్యో దెబ్బకే రాయి పగిలిందని చెప్పలేం. ముప్పైతొమ్మిది దెబ్బలు సహకరించి నలభయ్యో దెబ్బ ద్వారా ఫలితం కలిగిందని చెప్పవచ్చు. అలాగే సాధకుడు చేస్తున్న సాధన ఫలితం బాహ్యంగా కనిపించక పోయినా అంతరంగంలో ఆధ్యాత్మిక ఉన్నతి కలుగుతూనే ఉంటుంది.

శుద్ధ మనస్సు కలవానికి స్వప్నంలో కూడా నిరంతరం ఇష్టచింతనయే కలుగుతుంది. చెడు స్వప్నాలు రావు. అందరిలోనూ పరమాత్మను చూస్తూ, నిష్కామ కర్మ చేసేవారికి సర్వత్రా ఇష్ట దర్శనం జాగ్రదావస్థలో కలుగుతుంది. అంతవరకూ సాధన చేస్తుండాలి.

– సాయి రామానందస్వామి, పొదలకొండపల్లి

? : పుత్రులు, పుత్రికలు లేకుంటే వారి జీవన గమ్యమేమిటి?

✍: పుత్రులు, పుత్రికలు ఋణం తీర్చుకోవడానికి గానీ, చెల్లించడానికి గానీ పుడతారు. "ఋణానుబంధ రూపేణ పశుపత్ని సుతాలయాః" పద్మపురాణంలోని సంతానం లేని భార్యాభర్తల సంవాదంలో సతీమణి, భర్తగారికి సంతానం గురించి ఈ విధంగా చెప్పింది. మొత్తం లోకంలో ఐదురకాల ఋణాల వల్లనే సంతానం కలుగుతుంది.

ఉదాహరణ: ఒక వ్యక్తికి పుత్రుడు జన్మించగా పుత్రుని జాతకం జ్యోతిష్యునికి చూపించారు. జోస్యుడు "నీ కుమారుడు నీ ఋణం చెల్లించడానికి పుట్టాడు. కాబట్టి, ఇతని వద్ద నుంచి ధనం తీసుకోవద్దు" అన్నాడు. కుమారుడు పెరిగి పెద్దవాడై విదేశాలకు వెళ్ళి ధనం సంపాదించి ఇంటికి వచ్చాడు. ధనం ఉన్న పెట్టెను తండ్రి చేతికి ఇచ్చి వెంటనే కుమారుడు ప్రాణం విడిచాడు.

ఋణాలు ఐదురకాలు :

1. దేవదత్తుని వద్ద నుంచి ధనం తీసుకొని యజ్ఞదత్తుడనే వాడు దానిని చెల్లించకుండా మరణించాడు. మరు జన్మలో యజ్ఞదత్తుని పుత్రునిగా దేవదత్తుడు జన్మించి, తండ్రి ధనాన్ని దుర్వినియోగం చేసి, తండ్రిని దుఃఖంలో ముంచి మరణించాడు.

2. దాచిన సొమ్మును తిరిగి ఇవ్వక పోయినా, సొమ్ము దాచినవాడు కుమారునిగా పుట్టి, తల్లి తండ్రులను దుఃఖంలో ముంచి మరణిస్తాడు.

3. అకారణంగా ఇతరులను బాధపెట్టి సంతోషిస్తారు కొందరు. బాధపడిన వాడు తనను బాధపెట్టిన వారి కొడుకుగా మరు జన్మలో జన్మించి, తండ్రి ధనం తీసికొని విరోధిగా ఉండి పితృకర్మలు కూడా ఆచరించడు.

4. మాతా పితరుల సేవ చేసి ఋణ విముక్తులవుతారు కొందరు.

5. కర్మబంధనం చేత పుత్రులై జన్మించి, అంటీముట్టకుండా నిర్లిప్తంగా ఉంటారు మరికొందరు. అలాగే పుత్రికలు కూడా ఋణం తీర్చుకోవడానికీ, లేక ఋణం తీసుకోవడానికీ పుడతారు. "దుహ" "ప్రపూరణే" ధాతువు నుండి 'దుహితా' అనే శబ్దం ఏర్పడింది. దుహితా అంటే కుమార్తె. తల్లితండ్రుల ధన సంపత్తులను తన ఇంటికి చేర్చేది అని అర్థం. పాలు పితకడాన్ని 'దహన'క్రియ అంటారు. అలాగే కూతురు తల్లితండ్రులనే ఆవును పిండి, సొంత ఇల్లు అనే తన పాత్రను నింపుకుంటుంది.

ఏ విధమైన ఋణమూ లేనివారికి సంతానం ఉండదు. అందువల్లనే శ్రీమద్ భగవద్గీతలో "ఉద్ధరేదాత్మనాత్మానమ్" (6-5) అన్నారు. అలాంటి వారు తమ తపః శక్తితో మోక్షం పొందగలరు. వారికి మోక్షం పొందడానికి పుత్రులు కానీ, పుత్రికలు కానీ, మరెవరి సహాయం కానీ అవసరం లేదు. ❖

(...గత సంచిక తరువాయి)

- రెంటాల జయదేవ

మానసిక పూజే ముఖ్యం!

మానసిక పుష్పాలు

మానసికంగా కూడా ఎనిమిది పుష్పాలుంటాయి. అవి -

అహింసా ప్రథమం పుష్పం,
పుష్పమింద్రియ నిగ్రహః 34
తృతీయం తు దయా పుష్పం,
క్షమా పుష్పం చతుర్థకం,
ధ్యాన పుష్పం, తపః పుష్పం,
జ్ఞాన పుష్పం తు సప్తమం 35
సత్యం చైవాష్టమం పుష్ప
మేభిః తుష్యంతి దేవతాః 35 1/2

'దేవుణ్ణి మొదట 'అహింస' అనే పుష్పంతో పూజించాలి. మరోమాటలో చెప్పాలంటే, ఏ ప్రాణికీ మానసికంగా కూడా బాధ కలిగించకుండా ఉండడమే దేవుడికి సమర్పించే ప్రథమ పుష్పం.

'ఇంద్రియ నిగ్రహం' అనేది రెండో పుష్పం. అంటే, చేతులు, కాళ్ళు మొదలైన కర్మేంద్రియాలనూ, మనస్సుతో సహా జ్ఞానేంద్రియాలనూ భక్తుడు తన అదుపులో ఉంచుకోవడమే దేవుడికి అందించాల్సిన రెండో పువ్వు.

'దయ' అనేది మూడో పుష్పం. కష్టాలలో, బాధలలో ఉన్న వారి బాధలను తొలగించడానికి చేసే కృషే 'దయ'. అది దేవుడికి అర్పించాల్సిన మూడో పుష్పం.

'క్షమ' అనేది నాలుగో పుష్పం. ఎవరైనా తనకు అపకారం చేసినప్పటికీ, ఓరిమితో సహించడమే 'క్షమ'. ఇదే భగవంతుడికి ఇవ్వాల్సిన నాలుగో పుష్పం.

'ధ్యానం' అయిదో పువ్వు. ఇష్టదైవాన్ని నిరంతరం మనస్సులో తలచుకొంటూ, ఆయన మీదే మనస్సును లగ్నం చేయడం 'ధ్యానం'. దేవుడికి అర్పించాల్సిన అయిదో పుష్పమిది.

'తపస్సు' ఆరో పుష్పం. మానసిక, వాచిక, కాయిక నియమాలు ఉండడం తపస్సు. ఇదియే దేవుడికి అర్పించాల్సిన ఆరో పుష్పం.

'జ్ఞానం' ఏడో పుష్పం. పరమాత్మను గురించిన సరైన తెలివి ఉండడమే జ్ఞానం. దేవదేవుడికి సమర్పించాల్సిన ఏడో పుష్పం.

'సత్యం' ఎనిమిదో పుష్పం. ఇతరులకు బాధ కలిగించకుండానే యథార్థం పలకడమనేది సత్యమనే ఎనిమిదో పువ్వు. భగవంతుడికి ఇవ్వాల్సిన ఎనిమిదో పుష్పం.

- ఈ ఎనిమిది రకాల పుష్పాలతోనూ పూజిస్తే దేవతలు సంతోషిస్తారు.

భౌతికమైన పుష్పాలతో, ధూపదీపాలతో, ఫలాది నైవేద్యాలతో పూజించడం ప్రాథమికమైన పూజకు సంకేతం. అయితే, ఈ బాహిరమైన పూజలతో పాటు ఆంతరంగికమైన మానసిక పూజ కూడా ఎంతో ప్రధానం. అహింసాది ఉత్తమ గుణాలను అలవరచుకొని, ఈశ్వరార్పణ బుద్ధితో పరోపకారం చేయడమే మానసిక పూజ. ఇదే నిజమైన పూజ. దేవతలను అక్షరాలా ఆనందపరచే పూజ.

ఈ మానసిక పూజ, మానసిక పుష్పాల గురించి కొద్దిపాటి తేడాతో ఆది శంకరాచార్యులు సైతం చెప్పారు.

జ్ఞాని అయిన భక్తుడు మానసిక పూజలో తన హృదయాన్నే ఆ భగవంతుడికి ఆలయంగా చేయాలి. శమ, దమాలతో స్థలాన్ని శుద్ధి చేయాలి. హృదయాలయంలోనే ఆ సర్వేశ్వరుణ్ణి ప్రతిష్ఠించుకోవాలి.

అహింసా ప్రథమం పుష్పం, పుష్పం ఇంద్రియ నిగ్రహం ।
సర్వభూత దయా పుష్పం, క్షమా పుష్పం విశేషతః ॥
శాంతి పుష్పం తపః పుష్పం, ధ్యాన పుష్పం తథైవ చ ।
సత్య మష్టవిధం పుష్పం విష్ణోః ప్రీతికరం భవేత్ ॥

'అహింస, ఇంద్రియ నిగ్రహం, సర్వభూతాల పట్ల దయ, క్షమా గుణం, శాంతిత్వం, తపస్సు, ధ్యానం, సత్యం - అనే ఎనిమిది మనఃపుష్పాలు ఆ భగవంతుడికి అత్యంత ప్రీతికరమైనవి. కాబట్టి, పరిపూర్ణ విశ్వాసంతో, చిత్తశుద్ధితో మనం వాటిని సమర్పించాలి' అని భావం.

మొత్తం మీద పూజ బాహిరమైనదైనా, మానసికమైనదైనా మనం అర్పించే పుష్పాల ప్రాధాన్యాన్ని తెలుసుకొని, వ్యవహరించడం ముఖ్యం. ❖

('సకల శుభకరం శంఖం' వచ్చే సంచికలో...)

బంగారు బుద్ధుడు

కథ: స్వామి విమూర్తానంద   చిత్రాలు : మ.సె.   తెలుగుసేత : స్వామి జ్ఞానదానంద








4
మరుసటిరోజు, ప్రజలు వేల సంఖ్యలో గుమిగూడారు. భిక్షువులందరూ కలిసి బుద్ధుని ప్రతిమను ఉంచిన వాహనాన్ని ఊరేగింపుగా తీసుకెళ్ళసాగారు.
అసంఖ్యాక జన సమూహం బుద్ధుణ్ణి దర్శించుకోవడానికి వచ్చింది. ఊరేగింపు మందకొడిగా ముందుకు సాగుతోంది.


5
ప్రజలందరూ ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొని ఆనందపరవశులయ్యారు. ఆకాశం హఠాత్తుగా మేఘావృతం కావడం వారు గమనించలేదు.


6
అరే! ఆకాశంలో దట్టమైన మేఘాలు! భగవాన్! ఇదేమి విపరీతం!
భిక్షువులారా! వర్షంలో బుద్ధుని విగ్రహం తడవకూడదు. అది మట్టి విగ్రహం, కరిగిపోతుంది. విగ్రహాన్ని వెంటనే పరదాలతో కప్పండి.

మిగతా 36వ పేజీలో...

మానవత్వం, దివ్యత్వాల సంగమం

దివ్యజనని జీవితం

-ప్రవ్రాజిక భవానీప్రాణ

దేవతలు మానవరూపంలో జన్మించి, మనలాగే ప్రవర్తిస్తూ మన మధ్యనే కలసి మెలసి తిరుగుతూ ఈ ప్రపంచంలో ఉంటారు. అయితే వారిని గుర్తించడం చాలా కష్టం.

నాహం ప్రకాశః సర్వస్య యోగమాయా సమావృతః...(గీత :7.25)

'యోగమాయ ఆవరించడం వల్ల సాధారణ జనులు నన్ను గుర్తించలేరు'అని శ్రీకృష్ణుడు అన్నాడు.

"రాత్రిపూట చంద్రుని ప్రతిబింబం నీటిలో కనిపిస్తుంది. చిన్న చేపలు ఆ ప్రతిబింబాన్ని ఆటవస్తువుగా భావించి ఆనందంగా దానితో ఆడుకుంటాయి. చంద్రాస్తమయం అయ్యాక చేపలు ఆ చంద్రుని ప్రతిబింబమే తమతో ఉన్నదనీ, నిజమైన చంద్రుడు అందుకోలేనంత దూరంలో ఉన్నాడనీ గ్రహిస్తాయి" అని శ్రీశారదామాత అంటారు.

దివ్యత్వం ధృవీకరణ: శారదాదేవి దివ్యత్వాన్ని తనంతట తాను దయతో తెలియజేస్తే తప్ప ఆమెను ఎవరు అర్థం చేసుకోగలరు! అందుకనే ఆమె అప్పుడప్పుడూ చిన్న చిన్న మాటలలో తన తత్వాన్ని తెలియబరచేవారు. ఉదాహరణకు అమ్మ స్వయంగా చెప్పిన ఈ మాటలనే చూద్దాం: "కొన్ని సార్లు నేను రామ్‌ముఖర్జీ కూతుర్ని మాత్రమే అనుకుంటాను. నా వయస్సు స్త్రీలు జయరాంబాటీలో చాలా మంది ఉన్నారు. వారికీ, నాకూ తేడా ఏమిటి? ఏక్కడి నుంచో భక్తులొచ్చి నమస్కారాలు చేసేవారు. వారి గురించి వాకబు చేస్తే - ఒకరు డాక్టరు, ఒకరు ఇంజనీరు, మరొకరు లాయరు- ఇలా ఉండే వారు. వారందరూ ఇలా ఇక్కడకు ఎందుకు వస్తున్నారు? ప్రజలు నన్ను దేవి అనీ, దైవం అనీ అంటున్నారు. బహుశా అది నిజమేనని నేనూ అను కుంటాను. లేనట్లయితే ఇన్ని దివ్య అనుభూతులు నాకెందుకు కలుగు తాయి? ఇది నిజంగా దివ్య శరీరమే అయి ఉంటుంది. మానవ జన్మ ఎత్తిన వారెవరైనా ఇంతటి అనుభూతులను భరించగలరా?"

ఒకరోజు శారదాదేవి ఉద్బోధన్‌లో పూజ చేస్తుండగా, పిచ్చి అత్త ఆమెను తిడుతున్నారు. పూజ అయిన తరువాత శారదామాత "ఎంతో మంది ఋషులు కఠిన తపస్సు చేసిన తరువాత కూడా నన్ను అందుకోలేరు. కానీ మీరో! నన్ను ఇంత సులభంగా పొందినా చేజార్చుకుంటున్నారు" అన్నారు.

ఒక భక్తురాలు ఒకసారి - "అమ్మా! మిమ్మల్ని దివ్యజననిగా మేమెందుకు గుర్తించ లేకపోతున్నాము?" అని అడిగింది. అమ్మ ఇలా సమాధానమిచ్చారు - "ప్రతి ఒక్కరూ గుర్తించగలరా తల్లీ! ఒక కొలను తీరాన ఒక వజ్రం పడి ఉంది. అందరూ ఆ కొలనులో స్నానం చేసే వారు. ఆ వజ్రం మీదనే తమ కాళ్ళు రుద్దుకొని వెళ్ళేవారు. ఒక రోజు అక్కడకు ఒక వజ్రాల వ్యాపారి వచ్చాడు. అతను దాన్ని చూసిన వెంటనే అది అత్యంత విలువైన వజ్రంగా గుర్తించాడు".

మరి ఆ వజ్రాల వ్యాపారి ఎవరు? అద్భుత వజ్రాల వ్యాపారి అయిన శ్రీరామకృష్ణులకు ఆమె ఎవరో తెలుసు. ఫలహారిణీ కాళీపూజ రోజున ఆయన శారదాదేవిని దివ్యజననిగా పూజించి, జపమాలతో సహా తన సాధనా ఫలాన్నంతా ఆమెకు అర్పించారు. ఆయన ఇలా అన్నారు: "ఆమె శారద, సరస్వతి, జ్ఞానదాయిని. అందరికీ జ్ఞానాన్ని ప్రసాదించడానికే ఆమె వచ్చింది."

పవిత్రతా స్వరూపిణి : శ్రీశారదామాత దురాశాపరులైన సోదరులు, పిచ్చిదైన సురబాల, విపరీత ధోరణి గల ఆమె

కూతురు రాధ, నళిని – ఇత్యాది బంధువుల మధ్య జీవించారు. కుటుంబ వ్యవహారాలలో అంతగా ఆమె మునిగి ఉండడం చూసి, 'యోగీన్ మా'కు శారదామాత దివ్యత్వం పట్ల ఒక మారు సందేహం కలిగింది. అప్పుడు శ్రీరామకృష్ణులు ఒక దృశ్యంలో ఒక పసిబిడ్డ మృతదేహం గంగా నదిలో కొట్టుకుపోతున్నట్లు చూపించి, "గంగానది ఈ మృతశరీరం వల్ల అపవిత్రం అవుతుందా? శారదాదేవి కూడా పవిత్ర గంగ లాంటిదే. ఆమె గొప్పతనాన్ని ఎన్నడూ సంశయించకు" అన్నారు.

మానవత్వం దివ్యత్వాల మేలి కలయిక: శ్రీశారదాదేవిలో మానవత్వం, దివ్యత్వం ఎంత అత్యద్భుతంగా సమ్మిళిత మైనాయంటే ఆ రెండిటి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గమనించడం చాలా కష్టం. ఈ రెండు తత్త్వాలూ ఆమె వ్యక్తిత్వంలో దర్శనమిస్తాయి. తల్లితండ్రులకు ప్రేమను పంచి ఇచ్చే పుత్రికగా, అపరిమిత శ్రద్ధతో చివరి వరకూ సేవలందించి కర్తవ్యపరాయణ అయిన భార్యగా, వచ్చిన భక్తులందరికీ స్వ-పర భేదం లేకుండా మాతృత్వపు వాత్సల్యాన్ని పంచి ఇచ్చి మాతృ మూర్తిగా ఆమె తన పాత్రను అత్యద్భుతంగా పోషించారు. కఠోర హృదయులైన బందిపోటు దంపతులకు ఆమె కాళీగా దివ్య దర్శనమివ్వడమే గాక, పుత్రికలా ప్రవర్తించి వారి హృదయాలలో తల్లి తండ్రుల ప్రేమనూ, వాత్సల్యాన్నీ రేకెత్తించింది. భర్తకు వంట చేసి పెట్టి సేవ లందించింది. అయినా అతి సహజంగా ఆయన పూజలు అందుకొంది. కనులు మూసుకొనీ, తెరచుకొనీ అద్భుత దివ్య దర్శనాలను ఎల్లప్పుడూ పొందుతున్నా వినయశీలి అయిన కోడలిగా, సంప్రదాయ గ్రామీణ యువతిగా ఇతరుల ముందుకు వచ్చేటప్పుడు ముసుగు కప్పుకొని... కుటుంబంలో తన పాత్రను చక్కగా పోషించేది. తానే స్వయంగా సరస్వతి అయినా ఆమె ఎంత నెమ్మదిగా, వినయంగా, లో గొంతుకతో మాట్లాడేదంటే ఆమె మాటలు ఇతరులు అర్థం చేసుకోవాలంటే – మధ్యలో ఒకరుండి, ఆ మాటలు చెప్పవలసి వచ్చేది. శిష్యులకు అత్యున్నత జ్ఞానాన్నిచ్చి ఆధ్యాత్మిక లక్ష్యం వైపు ఆమె నడపగలిగేది. శ్రీరామకృష్ణుని ప్రత్యక్ష శిష్యులకు సలహాలివ్వడమే గాక వారు ఎదుర్కొనే కఠిన సమస్యలకు అత్యంత సులభమైన పరిష్కారాలను ఆమె సూచించేది. అయినా ఆమె ఎంత అమాయకంగా ఉండేదంటే, గడియారానికి 'కీ' ఇవ్వగలిగిన బాలికను ఆమె ఎంతో మెచ్చుకొన్నారు. లాంతరులో సరిగ్గా వత్తి వేయడం, లాంతరు చిమ్నీ శుభ్రం చేయడం ఎంతో కష్టమైన పనిగా ఆమె భావించేవారు. పంపులో నుంచి నీరు వచ్చే ముందు వచ్చే "హుస్" అనే శబ్దం విని, పంపు లోపల పాము ఉందేమోననుకొని భయపడి పరుగెత్తారామె. ఇవన్నీ ఇలా ఉన్నా ఆమె సంఘ జనని, జ్ఞానదాయిని.

ముక్తిదాయిని మాతృమూర్తి: స్వామి వివేకానంద, శ్రీశారదాదేవిని సజీవ దుర్గాదేవిగా పూజించారు. స్వామి బ్రహ్మానంద శ్రీశారదామాతను దుర్గాష్టమి రోజున 108 కలువపూలతో పూజించారు. 'శ్రీమాత చేతిలోనే బ్రహ్మ జ్ఞానమనే ద్వారపు తాళం చెవి ఉంది. దయతో అమ్మ ఆ ద్వారం తెరవకపోతే, ముక్తి సాధ్యం కాదు' అని అంటారు స్వామి బ్రహ్మానంద.

సర్వసాధారణంగా మానవులందరూ అహంకార పూరితులై ఉంటారు. వేలమంది భక్తులు రాత్రింబవళ్ళు శ్రీశారదామాతను దుర్గా, కాళీ అని పిలుస్తూ పూజించేవారు. కానీ ఆమెలో లేశమంతయినా అహంకారం కనిపించేది కాదు. అంతటి అత్యున్నత గౌరవాన్ని పొంది అహంకరించకుండా ఉండగలగడం మానవ మాత్రులకు సాధ్యం కాదు.

ఒకసారి స్వామి ఈశానందను, 'శ్రీశారదామాత దివ్యత్వాన్ని ఎలా అర్థం చేసుకున్నారు' అని ఒకరు అడిగారు. ఆయన ఈ విధంగా అన్నారు– "ఎలాంటి కోరికలూ లేనివారి నెవరినైనా మీరు చూశారా? మానవులకు కోరికలుంటాయి. దేవునికి ఏ కోరికలూ ఉండవు. ఏ కోరికలూ లేని శ్రీశారదామాత సాక్షాత్తూ దివ్యజనని".

మానవాళి పట్ల అపారమైన కరుణతో దివ్యజనని మానవ జన్మ స్వీకరించింది. వాత్సల్యపూరిత సంబంధాన్ని సులభతరం చెయ్యడం కోసం ఆమె తన దివ్యత్వాన్ని కప్పి పుచ్చుకొని, మానవత్వపు ఛాయలనే ప్రకటించింది. అందువల్లే ఆమె లజ్జాపటావృతగా సౌలభ్యపు ముసుగునూ, సాధారణ స్త్రీలా మాతృత్వపు ముసుగునూ దాల్చింది. మనందరం మానవత్వం దివ్యత్వాల సంగమ తీర్థంలో మునిగి తరిద్దాం, అమ్మ కృపకు పాత్రులమవుదాం. ❖

అనువాదం: డా॥ పన్నాల శ్యామసుందర మూర్తి



బుద్ధం శరణం గచ్ఛామి!

- బ్రహ్మచారి గౌతమ్

"పురుషులలో పుణ్య పురుషులు వేరయా" అంటాడు యోగి వేమన. క్రీ॥పూ॥ ఆరవ శతాబ్దిలో వేదాలలోని జ్ఞాన కాండను పూర్తిగా విడిచిపెట్టి, కర్మకాండను కలుషితం చేసి, లోకులు పెడతోవ పట్టసాగారు. అందరూ అజ్ఞానం, అధర్మం అనే అంధకారంలో మునిగిపోతున్నారు. అలాంటి సమయంలో ధ్యానమగ్నుడై ఉన్న బోధిసత్త్వుడి దగ్గరకు దేవతలు వెళ్ళి, భూలోకాన్ని ధర్మ ప్రకాశంతో నింపాల్సిందిగా ప్రార్థించారు.

వారి ప్రార్థనను మన్నించి అది తన ఆఖరి జన్మ అని చెప్పి, ఈ జన్మలో బుద్ధత్వం పొంది లోకకల్యాణార్థం తన శాయశక్తులా కృషి చేసి, తరువాత నిర్వాణంలో లీనమవుతానన్నాడు బోధిసత్త్వుడు.

దివ్యపురుషుని ఆవిర్భావం: కపిలవస్తు దేశానికి రాజు శుద్ధోదనుడు. అతని పత్ని మాయాదేవి. ఒకరోజు మాయాదేవికి ఒక కల వచ్చింది. ఆ కలలో ఒక దివ్యమైన ఏనుగు దివి నుంచి భువికి రావడం, ఆ ఏనుగుకు దేవతలు అనేకులు పూలు వేస్తూ నమస్కరించడం, ఆ ఏనుగు తన దేహంలో లీనమవడం దర్శించింది. కాలక్రమంలో మాయాదేవి గర్భవతి అయింది. వైశాఖ పూర్ణిమ నాడు ప్రసవానికి పుట్టింటికి బయల్దేరింది. లుంబినీ వనం దాటుతుండగా ప్రసవవేదన ప్రారంభమై, అందమైన బాలుడు జన్మించాడు. మహారాజు చాలా ఆనందించాడు. శాక్యవంశంలో గౌతమ గోత్రంలో పుట్టిన ఆ బాలుడికి సిద్ధార్థుడు అని నామకరణం చేశారు. శుద్ధోధనుడు జ్యోతిష్కులను పిలిపించాడు. వారందరూ ఈ బాలుడు ప్రపంచానికే చక్రవర్తి అవుతాడనీ, అతని కీర్తి ప్రతిష్ఠలు ఆచంద్రార్కం వర్ధిల్లుతాయి అనీ అన్నారు. అయితే అసితుడు అనే మేటి జ్యోతిష్కుడు మాత్రం మౌనంగా ఉండిపోయాడు. మహారాజుగారు అతని అభిప్రాయం అడుగగా, బాలుడు యుక్తవయస్సులో అన్నీ పరిత్యజించి సన్యాసి అవుతాడని చెబుతూ, వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టాడు. రాజు దిగ్భ్రాంతుడయ్యాడు. అసితుడు రోదిస్తూనే ఉన్నాడు. శుద్ధోదనుడు, అసితునితో, "ఎందుకు అంతగా కన్నీరు కారుస్తారు! ఇతడు నా పుత్రుడు, మీ కుమారుడు కాదు కదా" అన్నాడు. దానికి జవాబుగా "ఓ రాజా! నీ కుమారుడు సామాన్యుడు కాదు. అతను కాబోయే బుద్ధుడు. ఎందరికో మార్గదర్శి అవుతాడు. అప్పటికి నేను బ్రతికి ఉండను. అతను బోధించే ధర్మం వినడానికి నేనుండను అని బాధగా ఉంది" అన్నాడు అసితుడు.

అది విన్న శుద్ధోదనుడు భయపడ్డాడు. తన కుమారుణ్ణి కంటికి రెప్పలా, ఏ బాధా దుఃఖమూ తెలియకుండా కాపాడుకోవాలను కున్నాడు. వృద్ధులు, రోగులు, మృతులు రాకుమారుని కంటబడకుండా కట్టుదిట్టం చేశాడు. అతను ఎటు వెళ్ళినా ఉల్లాసకరమైన దృశ్యాలే కనపడేలా జాగ్రత్తలు తీసుకున్నాడు. రాకుమారునికి వేసవి కాలానికీ, వర్షాకాలానికీ, శీతకాలానికీ వేరు వేరుగా మూడు భవనాలను నిర్మింపజేశారు. నిత్యం నృత్య, గానాలతో ఆనందకరంగా ఉండడానికి పలువురు కళాకారుల్ని ఏర్పాటుచేశారు. ఈ ప్రపంచంలో బాధలు, దుఃఖాలు అనేవి ఉంటాయనే సంగతి రాజకుమారుడికి తెలియకుండా జాగ్రత్తపడ్డారు.

జీవన యాత్రలో మజిలీలు : యుక్తవయస్సు వచ్చిన సిద్ధార్థుడికి రూపవతి, సుగుణవతి, సౌశీల్యవతి అయిన యశోధర అనే రాజకుమారితో వివాహం జరిపారు. అన్ని సుఖాల మధ్య పెరిగినా సిద్ధార్థుడు అంతర్ముఖుడై ఉండేవాడు. ఒకరోజు సాయంసమయంలో అంతఃపుర ఉద్యానంలో విహరిస్తున్న రాకుమారుడికి పురవీధులలో తిరిగి రావాలనిపించింది. వెంటనే చెన్నుడు అనే రథసారథిని పిలిపించి, రథాన్ని సిద్ధం చెయ్యమన్నాడు. మహారాజు గారి అనుమతి లేనిదే తాను ఆ పని చెయ్యలేనన్న చెన్నుణ్ణి తాను కాబోయే మహారాజుననీ, తన ఆజ్ఞను పాలించాలనీ చెప్పి బలవంతంగా ఒప్పించాడు సిద్ధార్థుడు.

నగర వీధులలో తిరుగుతుండగా సిద్ధార్థుడి దృష్టి ఒక వృద్ధుడి మీద పడింది. అప్పటి వరకూ యువరాజు వృద్ధుల్ని చూడలేదు.

అతను చెన్నుణ్ణి "అతను ఎవరు, ఎందుకు అలా ఉన్నాడు?" అని ప్రశ్నించాడు. అతనొక వృద్ధుడనీ, కాలక్రమంలో అందరూ వృద్ధులవుతారనీ చెన్నుడు చెప్పాడు. "నేను, మా తండ్రిగారు – ఇలా నాకు తెలిసిన వాళ్ళందరూ వృద్ధులవుతారా?" అని అడిగాడు. చెన్నుడు "అవును, అందరూ వృద్ధులవుతారు" అంటూ, యువరాజు ముఖంలో విచారం చూసి రథాన్ని రాజభవనం వైపు తిప్పాడు.

ఇంతలో సిద్ధార్థుడు ఒక రోగిని చూశాడు. "అతను ఎవరు" అని ప్రశ్నించగా, "అతను ఒక రోగి" అని చెప్పి, "ముసలితనంలో రోగాలు వస్తాయి" అని చెన్నుడు అన్నాడు. సిద్ధార్థుడు "నాకూ, మా తండ్రిగారికీ, నీకూ – అందరికీ రోగాలు వస్తాయా?" అని అడిగాడు. చెన్నుడు "అవును" అంటూ రథాన్ని వేగంగా నడిపాడు.

ఈ లోగా సిద్ధార్థుడి కళ్ళకు ఒక మృతదేహం కనపడింది. ఆ మృతదేహాన్ని అంత్యక్రియల కోసం తీసుకుని వెళుతున్నారు. చెన్నుణ్ణి "ఎవరా వ్యక్తి? కదలకుండా ఉన్న అతణ్ణి ఎక్కడికి మోసుకుని వెళుతున్నారు?" అని అడిగాడు సిద్ధార్థుడు. చెన్నుడు "యువరాజా! అతను మరణించాడు. అతని దేహాన్ని దహనం చెయ్యడానికి శ్మశానానికి తీసుకు వెళుతున్నారు" అన్నాడు. "మనందరం కూడా చనిపోతామా?" అని అడిగాడు యువరాజు. "అవును యువరాజా! పుట్టిన ప్రతీ జీవీ చనిపోతుంది" అన్నాడు.

సిద్ధార్థుడి దృష్టి ఒక సాధువు మీద పడింది ఈ మారు. "ఇంటింటికీ వెళ్ళి భిక్ష అడుగుతున్న ఆ వ్యక్తి ఎవరు? ఆయన ముఖం ఎంత ప్రశాంతంగా ఉంది!" అన్నాడు. చెన్నుడు "అతనొక సాధువు. అతను ఈ ప్రపంచాన్ని త్యజించాడు; సన్యసించి సత్యాన్వేషణ చేస్తున్నాడు" అన్నాడు. ఇవన్నీ చూశాక ఎప్పుడూ చిరునవ్వుతో ఉండే యువరాజు ముఖంలో చింత, నిరుత్సాహం వ్యక్తమయ్యాయి.

సత్య శోధనలో ముందుకు...

సత్యాన్వేషణ కోసం ఆ సాధువులా జీవించాలని నిశ్చయించుకున్నాడు. అప్పుడు తనకు మగసంతానం కలిగిందన్న వార్త వచ్చింది. సిద్ధార్థుడు మరొక కొత్త బంధం అని విచారించాడు. ఒక అర్ధరాత్రి వేళ సిద్ధార్థుడు అన్నింటినీ పరిత్యజించి, సత్యాన్వేషణకై వెళ్ళిపోయాడు. సాధు పుంగవులనూ, గురువులనూ ఆశ్రయించి వారి వద్ద ఎన్నో విషయాలను తెలుసుకున్నాడు. అయినా తృప్తి చెందక భయంకరమైన అడవిలో ఆరేళ్ళ పాటు కఠోరమైన తపస్సు చేశాడు. అయినా సత్యసాక్షాత్కారం కలగకపోవడంతో ఒకనాడు బోధిచెట్టు క్రింద కూర్చుని సత్యం సాక్షాత్కరించే వరకూ మృత్యువునైనా ఆహ్వానిస్తాను కానీ ఇక్కడి నుంచి కదలనని దృఢంగా నిశ్చయించుకున్నాడు. ఆ రాత్రే సిద్ధార్థుడికి సత్యసాక్షాత్కారం కలిగింది. శాక్య వంశంలో జన్మించిన సిద్ధార్థుడు బుద్ధుడయ్యాడు.

శాక్యముని శాంతి సందేశం: కర్మబంధాల కారణాలు, సృష్టి రహస్యాలు తెలుసుకుని, జనన మరణాలనే చక్రభ్రమణం నుంచి జీవన్ముక్తుడయ్యాడు. తనకు కలిగిన ధర్మజ్ఞానం సూక్ష్మాతి సూక్ష్మమైనదనీ, దానిని లోకులు తెలుసుకోలేరనీ భావించి నిర్వాణంలో లీనం కావాలనుకున్నాడు. అది తెలుసుకుని బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై, లోకహితం కోసం ధర్మస్థాపన చేయాల్సిందిగా కోరాడు; అతడు ధర్మసంస్థాపన చెయ్యకపోతే లోకం అజ్ఞానంలో కూరుకుపోతుందని కూడా అన్నాడు. అది విని బుద్ధుడు లోకంలో ధర్మచక్రం కదిలేలా చేసి, ఆ తరువాత నిర్వాణంలో లీనమవుతానన్నాడు.

బుద్ధుడు ముందు తాను సన్యసించిన వెంటనే కలిసిన సాధువుల దగ్గరకు వెళ్ళాడు. వారంతా బుద్ధుడితో మాట్లాడ కూడదనుకున్నా, తమ దగ్గరకు బుద్ధుడు రాగానే అతని ముఖంలోని దివ్యతేజస్సును చూసి తమంతట తామే అతనికి ప్రణామం చేశారు. ప్రపంచం అనిత్యమైనదనీ, పుట్టిన ప్రతీ ప్రాణికీ మరణం తప్పదనీ, దుఃఖాలన్నిటికీ కారణం కోరికలేననీ చెప్పి, అష్టాంగ ధర్మమార్గంలో నడచి కోరికల రూపంలో దాగి ఉన్న సంస్కారాల వాసనలను నిర్మూలించినట్లైతే విముక్తి పొంది నిర్వాణం పొందవచ్చనీ బుద్ధుడు బోధించాడు. ఈ ధర్మబోధ నలుమూలలా వ్యాపించింది. బుద్ధుడు ఎక్కడకు వెళ్ళినా ప్రజలు తండోపతండాలుగా వచ్చి అతని ధర్మబోధ వినేవారు. రాజ్యాధిపతులు మొదలుకొని భిక్షగాళ్ళ వరకూ అందరూ బుద్ధుడి వద్దకు వెళ్ళి, ధర్మబోధ వినేవారు. బుద్ధుడు తన 36వ ఏటి నుంచి 80వ ఏటి వరకూ ధర్మబోధ చేసి తరువాత నిర్వాణంలో లీనమయ్యాడు.

బుద్ధుడి జీవితంలో వైశాఖ పూర్ణిమ విశేషమైన రోజు. వైశాఖ పూర్ణిమ నాడే బుద్ధుడు జన్మించాడు. వైశాఖ పూర్ణిమ నాడే బుద్ధుడు సన్యసించాడు. వైశాఖ పూర్ణిమ నాడే బోధిచెట్టు కింద సత్యదర్శనం జరిగింది బుద్ధుడికి. వైశాఖ పూర్ణిమ నాడే తన 80వ ఏట నిర్వాణంలో లీనమయ్యాడు.

ఈ వైశాఖ పూర్ణిమ నాడు బుద్ధ భగవానుణ్ణి తలచుకొని, ఆయన చెప్పిన ధర్మాన్ని పాటించాలని సంకల్పించుకుందాం! ❖

కర్ణుడి చరిత్ర ఓ సాహస యాత్ర

- ఆకెళ్ల రాఘవేంద్ర

కర్ణుడి గురించి తెలియని వారు ఉండరు. మహాభారతంలో వ్యాసుడు కర్ణుడి పాత్రను సృష్టించడానికి కారణం-ఓ జీవితసత్యాన్ని, ఓ వ్యక్తిత్వసూత్రాన్ని చెప్పేందుకే! ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని శాపాలు ఉన్నా, ఎన్ని అవరోధాలు కలిగినా, ఎలాంటి ప్రతి బంధకాలు ఎదురైనా-యుద్ధం చేయడం మానవధర్మం అని చెప్పడమే కర్ణుడి పాత్ర సృష్టి వెనుక దాగిన సత్యం! అందరికీ కూడా ఏవో కష్టాలు ఉంటూ ఉంటాయి. పరీక్షల్లో తప్పడమో, ఉద్యోగం లేకపోవడమో, ఉన్న ఉద్యోగం పోవడమో, అత్తవారింట్లో సాధింపులో, బాస్ పెట్టే వేధింపులో... ఏదైనా కావచ్చు... నిత్యజీవితంలో ఎవరి స్థాయిల్లో వారికి కష్టాలు ఉంటాయి. అయినా వాటన్నింటినీ ధైర్యంగా ఎదుర్కోవడమే వీరుడి లక్షణం!

కవచకుండలాలతో బోసినవ్వులు చిందిస్తూ పసిపాపగా ఉన్న కర్ణుణ్ణి పుట్టగానే కుంతీదేవి పెట్టెలో పెట్టి వదిలేసింది. చిన్నప్పుడే తల్లిని దూరం చేసుకొన్న దురదృష్టవంతుడు కర్ణుడు. బాల్యంలోనే అయిన వాళ్ళని పోగొట్టుకొన్న బాధ చాలా మందికి ఉంటుంది. భౌతిక శాస్త్రంలో ఎన్నో పరిశోధనలు చేసి 'పరావర్తన దూరదర్శిని'ని తయారు చేసిన ఐజాక్ న్యూటన్ పుట్టడానికి మూడు నెలల ముందే అతని తండ్రి మరణించాడు.

పెన్సిలిన్ అనే యాంటిబయోటిక్‌ను రూపొందించిన అలెగ్జాండర్ ఫ్లెమింగ్‌కు ఏడవ ఏట తండ్రి చనిపోయాడు.

అమ్మానాన్నల ఆలనాపాలనా లేకపోయినా-జీవితంలో అడుగులు ముందుకు వేసి విజయాలు సాధించిన వారెందరో! కర్ణుడు కూడా సూత కుటుంబంలో పెరిగి పెద్దవాడయ్యాడు.

అస్త్ర శస్త్రాలను సముపార్జించుకోవాలన్న ఉద్దేశంతో కర్ణుడు ఓ సారి భార్గవరాముణ్ణి తనకు ఆయుధాలను ప్రసాదించ మంటూ వేడుకొన్నాడు. క్షాత్రజాత్యహంకార నిర్మూలనకై ఆ అస్త్రాలను సంధిస్తాననడంతో ఆ పరశురాముడు పరవశ రాముడై సరేనన్నాడు.

అత్యంత శక్తిమంతమైన గరుడాస్త్రం, భార్గవాస్త్రం లాంటివాటిని కర్ణుడికి ప్రసాదించాడు పరశురాముడు. కర్ణుడు మహదానందపడ్డాడు. అంతవరకూ నిరాదరణకు గురైన తనకు ఇంతటి మహోన్నతమైన ఆయుధాలు లభించినందుకు ఎంతగానో ఆనందపడ్డాడు. కానీ ఏం లాభం వెలుగు వెనకే చీకటి ఉంటుంది. అది ప్రకృతి సహజం. ఆనందం వెంటే దుఃఖం ఉంటుంది. ఇది జీవిత సత్యం. కర్ణుడి విషయంలోనూ ఇది నిజం.

అలసిన భార్గవమహర్షి కొంచెం సేపు నిద్రించాలని భావించాడు. ఆ అడవిలో ఎక్కడని పడుకొంటాడు? అందుకనే కర్ణుడు 'నా ఒళ్ళో పడుకోండి గురువర్యా-నా తొడనే తలగడ చేసుకొని శయనించండి ఆచార్యా' అన్నాడు. అదే తన పాలిట శాపమవుతుందని కర్ణుడికేం తెలుసు?

భార్గవుడు కర్ణుడి తొడపై తలపెట్టుకొని అలా... ఓ కునుకు తీశాడో లేదో... ఇంద్రుడు కుమ్మరిపురుగై ఆ తొడను తొలిచేశాడు. రక్తం కారినా, బాధ గుండెల్ని మెలిపెట్టినా-గురువుగారికి నిద్రాభంగం కలుగుతుందని ఓర్పువహించాడు కర్ణుడు. ఆ రక్తం తడిగా తగలడంతో ఒక్కసారిగా లేచాడు పరశురాముడు. 'ఇంత ఓరిమి ఉంది అంటే నీ జాతిని శంకించాల్సిందే' అంటూ తాను ఇచ్చిన అస్త్రాలేమీ ఉపకరించవని శపించాడు పరుశురాముడు.

ఎంత బాధో చూశారా?! అంతవరకూ అస్త్రాలెన్నింటినో సముపార్జించానని సంబరపడ్డాడు కర్ణుడు. అంతలోనే శాపం. పైగా తానేమీ తప్పు చేయకుండానే ఈ దురదృష్టాన్ని మోయాల్సి వచ్చింది. అందరికీ కూడా ఎన్నో కొన్ని కష్టాలు అకారణంగా వచ్చిపడుతుంటాయి.

ఎంతో కష్టపడి ఒక పనిని ప్రారంభించి... ఎన్ని అవరోధాలు ఎదురైనా... ఓపికతో పనిచేసి... పనిచేసి... ఫలితాన్ని పొందాలనుకొంటాం. తీరా చివరి నిమిషంలో... చిట్టచివరి క్షణంలో పరిస్థితులు తారుమారై ఫలితం చేతికి రాకుండా

పోతుంది. ఒక్క మార్కులో... ఒకే ఒక్క మార్కులో ఐ.ఏ.ఎస్. లాంటి ఉన్నత ఉద్యోగాల్ని పోగొట్టుకొనే వారుండొచ్చు; రేపే కోతలుకోసి పంట ఫలాన్ని చేజిక్కించు కోవచ్చు కదా అని అనుకొన్న రైతుకు ఆరోజే... తుఫానొచ్చి పంట కాస్తా నాశనం కావచ్చు. ఇలా ఏదైనా జరగొచ్చు.

కర్ణుడికి జరిగింది అదే! అంతేకాదు– చూసుకోకుండా ఒక గోవుని చంపాడు కర్ణుడు. దాంతో ఆ గోవు యజమాని అయిన బ్రాహ్మణుడు 'నా జీవనాధారాన్ని పోగొట్టావు కాబట్టి నీవు నిరాధారుడివై మరణిస్తావుగాక' అని శపించాడు కర్ణుణ్ణి. ఒక బాలిక చేతిలో ఉన్న నూనె నేలపై పడిపోగా ఆ మట్టిని పిండి తిరిగి నూనెను తీసే ప్రయత్నం చేశాడు కర్ణుడు. 'నా గుండెను పిండావు కాబట్టి యుద్ధసమయంలో నీ రథం నేలలో కుంగిపోతుంది' అని శపించింది భూమాత.

చూడండి కర్ణుడికి ఎన్ని శాపాలో!! ఇదంతా ఒక ఎత్తు. యుద్ధభూమిలోకి వెళ్ళడానికి ముందే, ఏ కవచకుండలాలు ఉంటే తాను యుద్ధంలో విజేత అయ్యేందుకు అవకాశం ఉందో, ఆ కవచకుండలాలను కపట వేషధారి ఇంద్రుడు దానంగా అడిగితే మారుమాట మాట్లాడకుండా, మరో ఉద్దేశం లేకుండా కుండలాల్ని దానం చేసేశాడు కర్ణుడు.

ఇన్ని శాపాలు ఉన్నా యుద్ధభూమిలో తన రథం కుంగి పోబోతోందనీ, నిరాధారుణ్ణీ, నిరాయుధుణ్ణీ కాబోతున్నాననీ ముందే తెలిసినా కర్ణుడు యుద్ధరంగానికి వెళ్ళడం మానలేదు! యుద్ధానికి వెళ్ళాడు. విజయమా, వీరమరణమా అన్నది కాదిక్కడ ఆలోచించాల్సింది. శాపాలు ఉన్నాయని అసలు యుద్ధమే మానని వీరుడూ, ధీరుడూ కర్ణుడు.

మనం కూడా అలాగే ఎన్ని అవరోధాలు ఎదురైనా మన ప్రయత్నం మానకూడదు. ఎన్ని కష్టాలు ఎదురైనా మన కృషిలోపం ఉండకూడదు. కర్ణుడి జీవితం నుంచి నేర్చుకోవాల్సింది ఇదే! కష్టాలు సహజం, అవరోధాలు సహజం; అయినా అడుగు ముందుకే పడాలి.

మండుతున్న కాగడాని కిందకు వంచితే–మంట మాత్రం పైకే ఎగసిపడుతుంది. ధైర్యవంతుడు కూడా అంతే! పరిస్థితులు ఎంతగా ఎదురుతిరుగుతున్నా–మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగాలి.

కానీ అలాసాగితే కర్ణుడిలా మరణించక తప్పదు కదా, అన్న సందేహం రావచ్చు. కర్ణుడి మరణానికి కారణం–అతను అధర్మం వైపు నిలవడం!

కాబట్టి ధైర్యం, ధర్మం–అనే ఈ రెండు ఆయుధాల్ని చేతపట్టి ముందుకు సాగండి. ధర్మానికి పిరికితనం లేదు. ధైర్యానికి అపజయం లేదు. మనందరి జీవితాలూ విజయబావుటాలు కాబోతున్నాయి. ఇది తథ్యం! ❖

With Best Compliments From

పక్యాల భాస్కర రావు, మేనేజింగ్ డైరక్టర్ & పక్యాల గిరిజ, డైరక్టర్

SVISS LABSS LTD.,

(Manufacture of Bulk Drugs / Drugs Intermediates)
An ISO 9001 : 2000 Certified Company

No.88-89, Phase - II, Sipcot Industrial Complex,
Ranipet - 632 403, Tamil Nadu.

Web Site : www.svisslabss.com

"Are you growing spiritually? Can you love others? Can you feel oneness with others? Have you peace within yourself? And do you radiate it around you? That is called spiritual growth, which is stimulated by meditation, inwardly, and by work done in a spirit of service outwardly." *- Swami Ranganathananda*

ADVT.

అనర్థాలకు మూలం 'అత్యాశ'

– స్వామి రఘునాయకానంద



ఇటీవల ఏ వార్తాపత్రికలను చూసినా ఆర్థికమాంద్యం గురించే చెబుతున్నాయి. ప్రపంచంలో ఆర్థికంగా తలమానికం అనదగ్గ రీతిలో పురోగమిస్తున్న చైనా, అమెరికా, జపాన్, జర్మనీ లాంటి దేశాలను సైతం కుదిపేస్తున్న ఈ ఆర్థికమాంద్యం కారణంగా లక్షల మంది నిరాశ్రయులవుతున్నారు. ఒక్క రోజులో అమెరికాలో 70 వేల మంది నిరుద్యోగులైనట్లు వార్తలు వచ్చాయి. భారతదేశంలోనూ ఇదే స్థితి. ఈ పరిస్థితులలో యువతరం భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ఈ ఆర్థిక సంక్షోభానికి గల కారణం గురించి ఆలోచించి ప్రభుత్వాన్నీ, సాంకేతిక నిపుణులనూ, ప్రైవేటు భాగస్వామ్య సంస్థలనూ నిందించే కన్నా పరిష్కారం ఆలోచించాలి. It is better to light a candle than to curse the darkness – అంధకారాన్ని నిందించే కన్నా ఒక చిన్న క్రొవ్వొత్తిని వెలిగించడమే మేలు అని గ్రహించాలి. ఇది మన తక్షణ కర్తవ్యం.

ప్రపంచంలో గల దుఃస్థితిని భౌతిక అవసరాలతో సరి చేయలేం. మనిషికి భౌతిక అవసరాలు కలుగుతూనే ఉంటాయి. దుఃఖం ఉంటూనే ఉంటుంది. మనిషి స్వభావంలో మార్పు రావాలి. మొదట మనుష్యులు మారాలి అంటారు స్వామి వివేకానంద.

అత్యాశను విడిచి పెట్టాలి!

“ఆశాహిః పరమం దుఃఖమ్ , నైరాశ్యం పరమం సుఖమ్” – ఆశ దుఃఖానికి దారి తీస్తుంది. ఏ విధమైన ఆశలూ లేకుండా ఉండడం పరమ సుఖానికి దారి తీస్తుంది అన్నది ఆర్యోక్తి. ఒక సంపన్న భూస్వామికి ఉదయం నుంచి సూర్యాస్తమయం వరకూ ఎంత దూరం నడిస్తే అంత భూమిని ఇస్తామని బహుమానం ప్రకటించారు. అయితే సూర్యాస్తమయానికల్లా బయలుదేరిన ప్రదేశానికి చేరుకోవాలన్నది షరతు. భూస్వామి ఉదయమే బయలుదేరి త్వరత్వరగా నడవడం ప్రారంభించాడు. మధ్యాహ్నం అయింది. ఎండ తీవ్రత ఎక్కువ అవుతూనే ఉంది. అయినప్పటీ అతడు లెక్క చేయక వేగంగా నడక సాగిస్తున్నాడు. తీవ్రమైన దాహం, అలసట ఉన్నప్పటికీ ఎక్కువ భూమిని సంపాదించాలన్న ఉద్దేశంతో నడకను మాత్రం ఆపలేదు. వచ్చిన సదవకాశాన్ని జారవిడవకూడదు కదా! మధ్యాహ్నం దాటింది. విధించిన షరతు జ్ఞాపకానికి వచ్చింది. సూర్యాస్తమయానికి బయలుదేరిన ప్రదేశానికి చేరుకోవాలి. వేగంగా మరింత శక్తిని కూడగట్టుకుని తిరుగు ప్రయాణం ప్రారంభించాడు. సూర్యాస్తమయం అవుతుండడంతో శక్తికి మించిన శ్రమతో నడిచి గమ్యాన్ని చేరుకొని కుప్పకూలిపోయి చనిపోయాడు. ఇప్పుడు ఆయనకు కావాల్సింది ఆరడుగుల స్థలం మాత్రమే కదా! చూశారా! ఆశ ఎంతటి అనర్థానికి దారి తీసిందో! ఈ విషయం ధనికులు, భూస్వాములు, కార్పొరేట్ సంస్థలు గుర్తించాలి.

ఉదాత్త జీవనం – ఉన్నత ఆదర్శం

పాశ్చాత్య సంస్కృతీ నాగరకతలను అనుకరిస్తూ క్షణికమైన ఆనందం కోసం పరుగులు పెట్టడం మాని, ఒక ఉన్నతమైన ఆదర్శం కలిగి ఉండాలి. అది ఏమిటంటే – నైతిక విలువలతో కూడిన జీవితాన్ని గడపడం. సంపాదనే ఉన్నత ఆశయం కాదు. జీవన ప్రమాణాలు పెంచుకోవడం కాదు, అవసరాలకు తగ్గట్లు జీవిస్తూ ఉన్నదాంతో సంతృప్తి చెందాలి. అప్పుడే మనశ్శాంతి కలిగేది. జీవన నాణ్యతను పెంచుకొని, ఉన్నతమైన ఆలోచనలు కలిగి ఉండాలి. వారాంతంలో విచ్చలవిడి విందు వినోదాలను వీడి, కుటుంబంలోని పిల్లలు, పెద్దలనూ, వృద్ధులనూ ప్రేమగా పలుకరిస్తూ, వారి కోసం కొంత సమయాన్ని కేటాయించాలి. సమాజంలో హుందాగా జీవించడం ఉన్నత జీవనం కాదు. మనకున్న శీలసంపద, ఆలోచనలే మన జీవనసరళిని నిర్ణయిస్తాయి. ‘మన ఆలోచనలే మనల్ని గొప్పవాళ్ళను చేస్తాయి’ అంటారు స్వామి వివేకానంద. ‘ఆటపాటల్లో, వేషభాషల్లో, సుఖదుఃఖాల్లో, అన్ని దైనందిన కార్యాలలో నీతి తప్పని ధీరులై జీవించండి. అలాంటి ఆదర్శంతో జీవితాన్ని మలచుకుంటే ఇతరులు కూడా మిమ్మల్ని అనుసరిస్తారు’ అంటారు స్వామి వివేకానంద.

స్వశక్తి - దైవభక్తి

జీవితంలో ఒడుదొడుకులనేవి సహజం. అవి లేకపోతే జీవితానికి అందం లేదు. వాటికి భయపడకండి. ప్రయత్నం గురించి ఆలోచించండి. లేచి నిలబడండి. బలవంతులుగా ఉండండి. నా విధికి నేనే కర్తను అన్న వాక్యాన్ని పదే పదే స్మరించండి. 'ఇప్పటి వరకూ హుందాగా జీవించాను, ఏమిటి ఇప్పటి దుఃస్థితి. మా జీవితాలలో మళ్ళీ స్థిరపడతామా' అన్న నిరాశతో కూడిన ఆలోచన విడిచిపెట్టండి.

'విశ్వాసం.. విశ్వాసం, మీ మీద మీకు విశ్వాసం! తరువాత భగవంతుని మీద విశ్వాసం. అదే విజయ రహస్యం' అంటారు స్వామి వివేకానంద. చిన్నా పెద్దా అంటూ పనిలో తేడాలు చూడకుండా ఏ పని చేయడానికైనా ముందంజ వేయండి. ప్రపంచ చరిత్రలో మహాత్ములను పరిశీలిస్తే, వాళ్ళు కూడా

దుఃఖాలు, బాధల నుంచే పాఠాలను నేర్చుకొన్నారన్న విషయం తెలుస్తుంది.

ప్రతి రోజూ లేదంటే కనీసం వారాంతంలోనైనా సరే దేవాలయాలకు వెళ్ళి, మీ కోసం, అందరి కోసం ప్రార్థించండి. మీకు శక్తినీ, బలాన్నీ ఇమ్మని భగవంతుణ్ణి ప్రార్థించండి. అక్కడ జరిగే ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనండి. 'ఆధ్యాత్మికతను విడిచి పాశ్చాత్యుల నాగరకతను అనుసరిస్తే జాతి వినాశం చెందుతుంది. ఈ జాతీయ భవంతి పునాదులు కదిలిపోయి, జాతి సర్వనాశనమవుతుంది' అంటారు స్వామి వివేకానంద.

స్వార్థరాహిత్యం - సహనం

ఇతరులకు కొంత దానం చేస్తే మనం కొంచెం కోల్పోతామనే స్వార్థాన్ని వీడాలి. స్వార్థరాహిత్యమే విశేష లాభదాయకం. కానీ దాన్ని అలవరచుకొనే మనసు కావాలి. ఆరోగ్యరీత్యా కూడా అది ఎంతో లాభదాయకం అంటారు స్వామి వివేకానంద. ధర్మమార్గంలో సంపాదించిన డబ్బును స్వలాభాపేక్షకే కాక పరుల సేవకూ వినియోగించాలి. 'నేను – నాది' అన్న సంకుచిత భావం నుంచి 'మనం– మనది' అనే విశాల హృదయానికి ప్రయాణం చేయాలి.

సుఖదుఃఖాల సమ్మేళనమే జీవితం. సుఖదుఃఖాలు, జయాపజయాలు అనే ద్వంద్వాలు నాణానికి ఇరువైపులా ఉన్న బొమ్మ, బొరుసుల్లాంటివి. స్వామి వివేకానంద ఇలా అనేవారు: 'సుఖం, దుఃఖమనే కిరీటాన్ని ధరించి వస్తుంది. సుఖానికి స్వాగతం పలికేవాడు దుఃఖాన్ని అనుభవించడానికి కూడా సిద్ధంగా ఉండాలి'. శ్రీరాముడు పట్టాభిషేక వార్త విన్నప్పుడు ఆయన ముఖంలో ఉన్న ప్రశాంతతకీ, ఆ తరువాత కాసేపట్లో నీవు అరణ్యవాసం చేయాలన్నప్పటి ముఖంలో ద్యోతకమైన ప్రశాంతతకీ ఏమీ వ్యత్యాసం లేదని వాల్మీకి రామాయణం చెబుతోంది. 'మేము ఇప్పటి వరకూ ఉన్నత స్థితిలో ఉన్నాం. ఇప్పుడు ఏమిటి మా దుఃస్థితి' అని బాధపడే యువతీ యువకులు పై ఉదాహరణను ఆదర్శంగా తీసుకోవాలి. ద్వంద్వాలను ఎదుర్కొనే సహనాన్ని కలిగి ఉండాలి.

అప్పుడే వ్యక్తికీ, వ్యక్తికీ మధ్య; సమాజానికీ, సమాజానికీ మధ్య సామరస్య భావన కుదురుతుంది. ఆశ, అసూయ, ద్వేషాలు లేని సమాజాన్నీ, తద్వారా అవరోధాలను సైతం దాటిపోయే జీవితాన్నీ రూపొందించుకోగలం. ❖

యువవాణి

– స్వామి పరిజ్ఞేయానంద

ప్రశాంత్, రామిరెడ్డి, నాగరాజారావు, సుప్రియ, శ్రీలత

ప్రశ్న: రాజకీయ రంగంలో యువత పాత్ర ఏమిటి? స్వామి వివేకానంద 'వంద మంది యువకులతో ప్రపంచాన్నే విప్లవాత్మకం చేయవచ్చు'అని అన్నారు. నేటి రాజకీయాల్లో యువశక్తి వెల్లువై ప్రవహిస్తుంది కాబట్టి మన దేశం ప్రగతి పథంలో ముందంజ వేస్తుందంటారా? దేశనేతలకు స్వామి వివేకానంద ఇచ్చిన సందేశం ఏమిటి?

జవాబు: ప్రజల సంక్షేమమే ధ్యాసగా, దేశాభివృద్ధియే ధ్యేయంగా జీవించేవారే నిజమైన నాయకులు. అలాంటి నాయకుల్ని సృష్టించడంలో యువతే కీలకమైన పాత్రను పోషించాలి.

తండ్రి ఆజ్ఞమేరకు అయోధ్యను వీడి అరణ్యాలకు వెళ్ళిన శ్రీరాముణ్ణి ఎలాగైనా ఒప్పించి తిరిగి అయోధ్యకు తీసుకురావాలని భరతుడు రాముని దగ్గరకు వెళ్ళాడు. అన్నను చూసిన ఆనందంతో రామునికి పాదాభివందనం చేసి పైకిలేచిన భరతుణ్ణి రాముడు మొదట అయోధ్య నగరవాసుల క్షేమ సమాచారాల గురించి విచారించాడట. నిజమైన ప్రజా నాయకుడు వ్యక్తిగత విషయాలకన్నా ప్రజల సంక్షేమానికే ప్రాధాన్యతనివ్వాలన్న రాజనీతిని శ్రీరాముడు ప్రదర్శించాడు.

A politician thinks of the next election and a patriot thinks of the next generation. ***- James F. Clarke***

కాబట్టి ప్రతీ రాజకీయ నాయకుడూ ఎన్నికలలో ఎలా గెలవాలి అని ఆలోచించడం కన్నా ప్రజలకు ఎలా సేవలందించాలో అని ఆలోచించాలి. అప్పుడే రామరాజ్య స్థాపన సాధ్యమవుతుంది.

మన దేశం అన్ని రంగాల్లోనూ ప్రగతిని సాధించాలంటే శీలవంతులైన యువకులు కావాలని స్వామీజీ ఆశించారు.

భారతదేశ స్వాతంత్ర్యం కోసం మీరు పోరాటం సాగించవచ్చుకదా? అని అనేక మంది స్వామీజీని ప్రశ్నించి నప్పుడు 'నేను తలచుకుంటే భారతదేశానికి ఈ క్షణంలోనే స్వాతంత్ర్యం తీసుకురాగలను. కానీ స్వతంత్ర భారతదేశాన్ని సంరక్షించేందుకు శీలవంతులైన మనుష్యులు ఎక్కడ?' అని తిరిగి ప్రశ్నించారు స్వామీజీ.

'ఆత్మవిశ్వాసంగల వీర్యవంతులూ, ధైర్యవంతులూ, శీలవంతులూ అయిన వందమంది యువకులు ఉంటే మొత్తం ప్రపంచాన్నే మార్చవచ్చు' అని స్వామీజీ అన్నారు.

Men, men, these are wanted: everything else will be ready, but strong, vigorous, believing young men, sincere to the backbone, are wanted. A hundred such and the world becomes revolutionised.

- Swami Vivekananda

'పేరు ప్రఖ్యాతుల్నీ, ఆస్థి అంతస్తుల్నీ మరిచి పేద ప్రజల కోసం పరితపించడం, అహర్నిశలూ పరిశ్రమించడం'– ఇదే మన దేశ భక్తులకూ, సంస్కర్తలకూ, నాయకులకూ స్వామీజీ ఇచ్చిన సందేశం.

Do you feel that millions are starving today... Does it make you restless? Does it make you sleepless?... have you forgotten all about your name, your fame, your property, even your own bodies? First feel from the heart. That is the first step to become a patriot.

- Swami Vivekananda

మహాత్మాగాంధీ నుంచీ అబ్దుల్ కలాం వరకూ ప్రయోగించిన, ప్రయోగిస్తున్న భావాస్త్రాలు స్వామీజీ అంబులపొది నుంచి తీసినవే అన్న విషయం ఆయన ప్రసంగాలు చదివితే అర్థమవుతుంది. కాబట్టి నిత్యనూతనమైన స్వామీజీ సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణాత్మకం చేయాలి. అప్పుడే దేశాభివృద్ధి, శాంతి సమాజ స్థాపన సాధ్యమవుతాయి. ❖

మీ సందేహాల్ని పంపాల్సిన చిరునామా :

యువవాణి

శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం,
దోమల్‌గూడ, హైదరాబాద్ – 500 029



మహనీయుల జీవితాల్లో
మధురఘట్టాలు
- ఆర్. కృష్ణ

ఆదేశం కాదు ఆచరణ ముఖ్యం

అప్పుడు లాల్ బహదూర్ శాస్త్రి రైల్వే మంత్రిగా ఉండేవారు. ఆయన వారణాసికి దగ్గరగా ఉన్న సేవాపురికి వెళ్ళవలసి వచ్చింది. ఆయన అక్కడకు రైల్లో వెళ్ళారు. సేవాపురి రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారం ఎత్తుగా లేదు. శాస్త్రిగారు పొట్టిగా ఉండడం వల్ల ఆయనకు రైల్లోంచి ప్లాట్‌ఫారం మీదకు దిగడం చాలా కష్టమైంది. రైల్వేమంత్రి ప్లాట్‌ఫారం మీదకు దిగడానికి ఇన్ని పాట్లు పడడం చూసిన నలుగురు స్త్రీలు గట్టిగా నవ్వుతూ - "సరైన ప్లాట్‌ఫారం లేకపోవడం వల్ల ఆడవారికి ఎంత కష్టంగా ఉంటుందో ఇప్పుడు రైల్వే మంత్రికి తెలుస్తోంది" అన్నారు. అప్పుడే లాల్ బహదూర్ ప్లాట్‌ఫారం మీదకు దిగారు. ఆయన స్టేషన్ మాస్టర్ని పిలిచి, పార కావాలని అడిగారు. పార ఇచ్చిన వెంటనే లాల్ బహదూర్ పార పట్టుకొని, నేలను త్రవ్వడం మొదలుపెట్టారు. త్రవ్విన మట్టిని ఆ ప్లాట్‌ఫారం మీద పోయసాగారు. అది చూసి అక్కడున్నవారు కూడా పారలు మొదలైనవి తెచ్చుకుని తవ్వసాగారు. ప్లాట్‌ఫారం మూడు గంటల్లోపల మామూలు ఎత్తుకి లేచింది.

అధికారం కేవలం ఆజ్ఞలివ్వడానికే కాదనీ, ప్రజల అవసరాలను తీర్చడానికి వారు కల్పించిన ఒక బాధ్యత అనీ ఆచరణలో చూపిన ఆదర్శనేత లాల్ బహదూర్ శాస్త్రి. నేటి మన నేతలందరూ శాస్త్రిగారిని ఆదర్శంగా తీసుకొంటే భారతదేశం సర్వతోముఖాభివృద్ధి చెందుతుంది. ❖

వినయమే నిజమైన భూషణం

బిరుదులు, అవార్డులు, రివార్డులు ఎన్ని సాధించినా అత్యంత నిరాడంబరంగా చిన్న గదిలో తన పుస్తకాలతో కాలం గడిపే కలామ్‌కి 1990లో యాదవ్‌పూర్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ పట్టా ప్రకటించినప్పుడు తన పేరుతో పాటు నెల్సన్ మండేలా పేరు కూడా పేపర్లో చూశాడు. వెంటనే వారికి ఫోన్ చేసి, అంతటి మహనీయుడితో తాను సరితూగననీ, ఆయనతో పాటు తనకు ఇవ్వవద్దనీ కోరాడు. దానికి యూనివర్సిటీ వారు అంగీకరించలేదు.

అలాగే ఒకసారి మదురై కామరాజ్ విశ్వవిద్యాలయంలో స్నాతకోపన్యాసం ఇవ్వడానికి కలామ్ వెళ్ళినప్పుడు, ఆ ఊర్లో తనకు చదువు చెప్పిన దొరై సాలమన్ అనే ఉపాధ్యాయుడు ఉన్నారని తెలిసింది. ప్రభుత్వ వాహనాలున్నా, ఒక ప్రైవేటు టాక్సీ తీసుకొని కలామ్, ఆయన ఇంటికి వెళ్ళి తన ప్రసంగానికి ఆహ్వానించాడు. తన శిష్యుడి మాట కాదనలేక 80 ఏళ్ళ దొరై సాలమన్ ఆ సభకు వెళ్ళారు. కలామ్ ముందుగా ఆయనను మాట్లాడాల్సిందిగా రెండు చేతులూ జోడించి వినమ్రంగా కోరాడు. పక్కనే ఉన్న గవర్నర్ పి.సి. అలెగ్జాండర్ ఆ సన్నివేశాన్ని చూసి ఆశ్చర్యపోయారు.



వినయమే నిజమైన భూషణంగా కలిగిన అబ్దుల్ కలామ్ విద్యార్థి లోకానికి ఆదర్శనీయుడు. ❖

ఆధునిక యుగంలో ఆధ్యాత్మికత అవసరమా?

- స్వామి సేవ్యానంద

ఆధునిక విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానాల సహాయంతో ఒక మనిషి సుఖంగా ఉండడానికి అవసరమైన ఎన్నో రకాల సౌకర్యాలనూ, భోగాలనూ కనిపెట్టి ముమ్ముందుకు సాగుతున్న మనకు ఈ రోజుల్లో 'ఆధ్యాత్మికత' అవసరమా?

మన దుఃఖానికి కారణం ఏమిటి? ఈ జీవితంలో మనమెప్పుడూ ఆనందాన్ని కోరుకుంటాం కానీ దుఃఖాన్ని కోరుకోం. అయితే అన్ని రకాల సుఖాలూ మన ముందే ఉన్నప్పటికీ, మనం దుఃఖానికి ఎందుకు బానిసలమవుతున్నాం? ఒకసారి ఒక దేవత, ఒక రాక్షసుడు 'ఆత్మ'ను గురించి తెలుసుకోవడానికి ఒక మహాపురుషుని దగ్గరకు వెళ్ళారు. చాలా కాలం బోధించిన తరువాత ఆ మహాపురుషుడు "నీవే ఆత్మవు, నీకు నువ్వే తెలుసుకో" అని ఉపదేశించి, వారిని పంపించాడు. తన శరీరమే 'ఆత్మ' అని భావించి, ఇద్దరూ ఆనందంగా తిరిగి వెళ్ళారు. కొన్ని రోజుల తరువాత ఆ దేవతాపురుషుడు 'అనిత్యమైన ఈ శరీరం, శాశ్వతమైన ఆత్మ ఎలా అవుతుంది?' అని ఆలోచించడం మొదలు పెట్టాడు. చివరకు తన వివేచనా శక్తితో శరీరం మనస్సు, బుద్ధి, అహంకారాలకు అతీతమైన 'ఆత్మ'ను తన నిజస్వరూపంగా సాక్షాత్కరించుకొని, అనంతమైన ఆనందాన్ని అనుభవించాడు. తామసిక స్వభావుడైన రాక్షసుడు శరీరక సుఖ భోగాలను అనుభవించడంలోనే జీవితం గడిపాడు.

మనం చాలావరకు రాక్షస స్వభావాన్ని కలిగి, అనిత్యమైన ఈ శరీరమే సర్వస్వమని భావిస్తున్నాం. చివరకు దుఃఖాల పాలవుతున్నాం.

ఉన్నతమైన ఆనందానికై ప్రయత్నించు: శారీరక సుఖాలకు మించి ఉన్నతమైన ఆనందం ఏమైనా ఉందా? బాల్యంలో బొమ్మలాటలకు మించిన ఆనందం ఈ ప్రపంచంలో ఏదీ లేదని అనుకున్నాం. వయస్సు పెరిగాక జ్ఞానార్జనలోనే ఆనందం ఉందని తెలుసుకున్నాం. శారీరక ఆనందం కన్నా ఉన్నతమైనది ఈ జ్ఞానానందం. దీని కన్నా ఉన్నతమైనది ఆధ్యాత్మిక ఆనందం. ఈ ఆధ్యాత్మిక ఆనందం కన్నా ఉన్నతమైన ఆనందం ఈ విశ్వంలో మరొకటి లేదు. జంతువులు శారీరక ఆనందంతోనే తృప్తి చెందాల్సి ఉంది. దీనికి మించి ఇతర ఆనందాలను పొందే అవకాశం వాటికి లేదు. మనిషి కూడా క్షణభంగురమైన శారీరక ఆనందంతోనే తృప్తి చెందితే ఆ మనిషికీ, జంతువుకీ తేడా ఏముంది? అందుకే మానవ జీవితంలో ఉన్నతమైన జ్ఞానానందం, ఆధ్యాత్మికానందం పొందే ప్రయత్నం చేయాలి.

శాశ్వత ఆనందానికి ఉపాయం: మన అంతరంగంలో ఉన్న దివ్యానందాన్ని మరచి, ఎండమావుల్లాంటి భౌతిక సుఖాలకై మనం నలువైపులా పరుగులు పెడుతున్నాం. ఈ ప్రపంచంలో ఉన్న అన్ని సుఖాలూ, భోగాలూ కలిసినా ఒక్క మనిషిని కూడా తృప్తి పరచలేవు. ఆకలితో అలమటిస్తున్న సింహం నోటికి ఎలుకను ఇచ్చినట్లు, అనంతమైన ఆనందానికి అధికారులమైన మనం తుచ్ఛమైన ప్రాపంచిక సుఖాలతో ఎలా తృప్తి చెందగలం?

"శాస్త్రీయ విజ్ఞానం" ఎక్కడ అంతమవుతుందో, అక్కడ "ఆధ్యాత్మికత" ఆరంభమవుతుంది. మనకు జీవితంలో ఎదురవుతున్న అన్ని దుఃఖాలను సంపూర్ణంగా నివారించే శక్తి ఒక్క ఆధ్యాత్మిక జ్ఞానంలోనే ఉంది. దీన్ని పొందడానికై మన బాధ్యతలన్నీ వదిలిపెట్టి, ఏ దేవాలయంలోనో, ప్రార్థనాలయంలోనో గంటల కొద్దీ సమయం గడపనవసరం లేదు. దీనికి పూర్తి వ్యతిరేకంగా మనం చేసే పనిని మరింత నైపుణ్యంతో చేయాలి. "మన కర్తవ్యాలను నిస్వార్థభావంతో, నిస్సంగభావంతో నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక జీవితం యొక్క చరమలక్ష్యాన్ని సాధించగలం" అని స్వామి వివేకానంద చెప్పారు.

మనం పశు స్వభావాన్ని వదిలిపెట్టి మనుష్యులుగా జీవించాలంటే, శాశ్వత ఆనందాన్ని ఆస్వాదించాలంటే 'ఆధ్యాత్మికత'ను ఆశ్రయించడం ఒక్కటే ఉపాయం. ఈ మార్గాన్ని అనుసరిస్తే, మనలో ప్రతి ఒక్కరం ఆ దివ్యానందానికి వారసులం కాగలం. ❖

రామకృష్ణ మిషన్ సేవాశ్రమ (ధార్మిక ఆసుపత్రి)

(రామకృష్ణ మిషన్, పి.ఒ.బేలూర్ మఠ్, హౌరా జిల్లాకు అనుబంధిత శాఖాకేంద్రం)

స్వామి వివేకానంద మార్గ్, బృందావన్, మథుర జిల్లా, ఉత్తర్‌ప్రదేశ్-281 121.

ఫోన్ : 0565-2442310, ఫ్యాక్స్: 2443310

Email : rkmsvrnd@sancharnet.in, Website: www.rkmsvrind.org

విన్నపం

శ్రీకృష్ణుని దివ్యలీలా క్షేత్రం-యమునా నది ప్రవహిస్తున్న పుణ్య తీర్థం - బృందావనం. ఆ క్షేత్రం పేరు వింటేనే మనసు ఉన్నతమైన భక్తి భావనతో నిండిపోతుంది. శ్రీచైతన్య మహాప్రభువు, శ్రీరామకృష్ణుల సందర్శనం వలనా, మీరాబాయి, సూరదాసు, రూప, సనాతన గోస్వాములు మొదలైన భక్త శిరోమణుల సాధనల వలనా బృందావనం మరింత పవిత్రతను సంతరించుకొంది. ఈ పుణ్యక్షేత్ర వాసులకి రామకృష్ణ మిషన్ సేవాశ్రమ 1907 నుండీ అనేక సేవలు అందిస్తోంది.

'కాలాబాబు కుంజ్' భవనంలో శ్రీ శారదాదేవి బస చేసిన గది

శ్రీరామకృష్ణుల భక్తుడైన బలరాంబసుకి ఈ పవిత్ర వ్రజ భూమిలో "కాలాబాబు కుంజ్" అన్న పేరున్న పూర్వీకుల గృహం ఉంది. దివ్యజనని శ్రీ శారదాదేవి శ్రీరామకృష్ణులు మహాసమాధి చెందాక 1886లో బృందావనం వెళ్ళి ఈ "కాలాబాబు కుంజ్"లో సుమారు ఒక సంవత్సరం పాటు ఉన్నారు. ఆ తరువాత కూడా ఆమె అక్కడికి వెళ్ళినప్పుడు ఈ ఇంట్లోనే ఉండేవారు; ఇక్కడే శారదమ్మ మొట్టమొదట సారిగా స్వామి యోగానందకి మంత్రదీక్ష ఇచ్చారు. స్వామి వివేకానంద, స్వామి బ్రహ్మానంద, శ్రీరామకృష్ణుల ఇతర శిష్యులు ఆ ఇంట్లో ఉన్నారు. ఈ ఇంట్లోనే 1907లో రామకృష్ణ మిషన్ సేవాశ్రమ కేంద్రం లాంఛన ప్రాయంగా ప్రారంభమైంది.

మాతృమూర్తి శ్రీ శారదాదేవి పావనం చేసిన ఈ గృహాన్ని (కాలాబాబు కుంజ్) ఒక ఆధ్యాత్మిక స్మారక చిహ్నంగా

శ్రీ శారదాదేవి బస చేసిన 'కాలాబాబు కుంజ్' భవనం

తీర్చిదిద్దాలని బృందావనం రామకృష్ణ మిషన్ సేవాశ్రమ సంకల్పించింది. శ్రీ శారదాదేవి దివ్య స్మృతులను జ్ఞాపకం చేసుకొని ఆధ్యాత్మికంగా సన్న్యాసులూ, భక్తులూ లబ్ధి పొందడం కోసం దివ్యజనని ఉన్న 'కాలాబాబు కుంజ్' ఇంట్లోని ఒక భాగాన్ని రూ॥38 లక్షలకు కొనుగోలు చేయడం జరిగింది. కాలాబాబు కుంజ్‌లోని మిగతా భాగాన్ని కొని, మరమ్మత్తులు చేయించి ఈ స్మృతి కేంద్రంలో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్ని ప్రారంభించాలని సంకల్పించాం. ఈ భవనం కొనడానికీ, మరమ్మత్తులు చేయించడానికీ సుమారు **ఒక కోటి ముప్పై లక్షలు** వ్యయం అవుతుందని అంచనా.

ఈ ఆధ్యాత్మిక స్మృతి కేంద్ర నిర్మాణానికి మీరంతా ఉదారంగా విరాళాలిచ్చి సహకరించాల్సిందిగా కోరుతున్నాం.

"Ramakrishna Mission Sevashrama, Vrindaban" పేరున చెక్కు లేదా డి.డి తీసి క్రాస్ చేసి మీ విరాళాల్ని Ramakrishna Mission Sevashrama, Swami Vivekananda Marg, Vrindaban, Dist: Mathura, Uttar Pradesh-281 121 అనే చిరునామాకు పంపాల్సిందిగా మనవి. ఆదాయపు పన్ను చట్టంలోని 80(జి) విభాగం కింద విరాళాలకు పన్ను మినహాయింపు లభిస్తుంది.

భగవత్సేవలో

స్వామి సుప్రకాశానంద

కార్యదర్శి

ADVT.

శీల నిర్మాణానికి ఆధ్యాత్మికతే ఆధారం!

- డాక్టర్ కమల ఎస్. జయరావు

శీల నిర్మాణానికి నేడు మూడు ప్రధాన ఆటంకాలు కనబడుతున్నాయి.

1. వినియోగదారీ తత్వం (కన్స్యూమరిజం)!
2. ప్రసార మాధ్యమాలు (దృశ్య, శ్రవణ, ముద్రణ)
3. వేళ్ళూనుకొన్న అవినీతి, అన్యాయం

వినియోగదారీ తత్వం: పూర్వం అమ్మకాలు రైతుల ద్వారా, చిన్న అంగళ్ళలో జరిగేవి. ఇప్పుడు వాటిని పెద్ద పెద్ద కార్పొరేటు సంస్థలు కైవసం చేసుకున్నాయి. పూర్వం కన్నా ఇప్పుడు మధ్యతరగతి ప్రజల చేతుల్లో నిత్యావసరాలకు కావలసిన దాని కన్నా అధికంగా డబ్బు ఉంది. మునుపటి రోజుల్లో ఏది ఎప్పుడు అవసరమో అది అప్పుడు కొనేవారు. కానీ నేడు కొనుగోళ్ళు ఒక జీవన విధానంగా మరాయి. దాన్ని నేటి యువతరం పరిభాషలో 'కూల్ ఫన్' అంటారు. తినడం, తాగడం లాగే కొనుగోళ్ళు సాగించడం కూడా జీవితంలో విడదీయరాని అంశంగా మారింది. సంపన్నుల లాగ మధ్యతరగతి వారు కూడా 'కామినీ కాంచనాల' గుప్పెట్లో ఉన్నారు. ఇది శీలనిర్మాణానికి పెద్ద సవాలుగా నిలిచింది.

తల్లితండ్రులిద్దరూ బయట ఉద్యోగాలు చేయడం సర్వసాధారణమైంది. ఆర్థిక ఇబ్బందులు లేకున్నా తల్లి ఉద్యోగం చేయడమే రివాజు. పిల్లలతో తగినంత సమయం గడపలేక పోతున్నామనే బాధ తల్లితండ్రుల మనస్సుల్లో ఒక మూల ఎక్కడో నక్కి ఉంటుంది. ఇందుకు పరిహారంగా పిల్లలు ఏది కోరినా కాదనకుండా చేయడం, లేదనకుండా కొని ఇవ్వడం జరుగుతోంది.

అర్థంపర్థం లేకుండా సాగుతున్న వినియోగదారీ తత్వాన్ని ప్రసార మాధ్యమాలు మరింత బలపరచి, ఎగదో స్తున్నాయి. ఈనాడు మారుమూల పల్లెల్లో సైతం టీవీలున్నాయి. వ్యాపార ప్రకటనలన్నీ యువతులనూ, పిల్లలనూ ఉద్దేశించే నిర్మితమవుతున్నాయి. శరీర సౌందర్య పోషణే జీవితంలో అత్యంత ప్రధాన విషయం అనే భావాన్ని ఈ ప్రకటనలు పిల్లల మనస్సులపై గట్టిగా ముద్ర వేస్తున్నాయి. వీటి ప్రభావం వల్ల పిల్లలు తమకు కావలసినవి దబాయించి కొనిపించుకొనడమే కాక ఇంట్లోకి ఏ యే ఆహారపదార్థాలు, సౌందర్య సాధనాలు కొనాలో వారే నిర్ణయించే స్థాయికి చేరారు.

ప్రసార మాధ్యమాలు (దృశ్య, శ్రవణ, ముద్రణ) : ప్రసార మాధ్యమాల ప్రభావం నేటి యువతపై చాలా తీవ్రంగా ఉంది. అధిక శాతం పిల్లలు సొంత సెల్‌ఫోను, కంప్యూటర్లు కలిగి ఉండడం ఇప్పుడు ఒక సర్వసాధారణ విషయం. పిల్లలు సెల్‌ఫోన్లో ఎవరితో మాట్లాడుతున్నారో, ఇంటర్నెట్‌పై ఏ సమాచారం పొందుతున్నారో, ఎవరితో సంభాషణలు సాగిస్తున్నారో చాలా మంది తల్లితండ్రులకు తెలియనే తెలియదు.

పిల్లల్లో అనవసర కుతూహలాన్ని రేకెత్తించే పరిస్థితులు సమాజమంతటా కనపడుతున్నాయి. తత్కారణంగా చాలా మంది యువతీ యువకులు దారి తప్పుతున్నారు. వార్తాపత్రికలలోనూ, 'సకుటుంబ' సచిత్ర వారపత్రికలు అనబడే వాటిలోనూ ప్రచురిస్తున్న సినిమాలలోని అసభ్యకరమైన చిత్రాలు యువతరాన్ని పెడదారి పట్టిస్తున్నాయి.

నిత్యజీవితంలోనూ, తెర మీదా కనపడే హింసాకాండ శీల నిర్మాణానికి పెద్ద అవరోధం. చెడుపై మంచిదే అంతిమ విజయమన్నది పురాణేతిహాసాలలోని హింస, వధ ద్వారా తెలియవచ్చే గుణపాఠం. కానీ నిజజీవితంలో మనకు ఇది కనబడడం లేదు. మనదేశంలోనే కాక యావత్ ప్రపంచంలో విస్తరిస్తున్న, కొనసాగుతున్న హింసాకాండలో విజేతలు, పరాజితులు అంటూ ఉండడం లేదు. మతం పేరిట, దేశభక్తి పేరిట, సంస్కృతీ పరిరక్షణ పేరిట మనదేశంలో నేడు చెలరేగుతున్న హింస యువతరాన్ని ఛాందసులుగా, మతోన్మాదులుగా మారుస్తోంది. సినిమాల్లో హీరోకూ, విలన్‌కూ తేడా తెలియడం లేదు. ఈ పాత్ర, ఆ పాత్ర కూడా అందంగా, ఆకర్షణీయంగా కనబడతాయి. ఇదంతా పిల్లలకూ, యువతరానికీ ఎలాంటి సందేశాన్ని అందిస్తున్నాయో ఎవరికైనా తెలుసా?

ఎవరైనా ఆలోచిస్తున్నారా? దృశ్య-శ్రవణ మాధ్యమాలు వినోదం పంచడానికే కానీ విద్యాబోధన వాటి ఉద్దేశం కాదని ఒక వాదన. ఒప్పుకొందాం! కానీ ఇంద్రియాలను ఉద్రేకపరచేది వినోదమా? వినోద కార్యక్రమాలు పిల్లల కళాత్మక దృష్టిని పదునుపెట్టేవిగా ఉండాలి. జానపదమే కానీ, శాస్త్రీయమైనవే కానీ భారతీయ కళలన్నీ భక్తిపూర్వక ఆధ్యాత్మిక నేపథ్యం, సందేశం కలిగి ఉంటాయి. పిల్లలు, నిరక్షరాస్యులు- వీటి ద్వారానే జీవితపు విలువలు నేర్చుకొనేవారు. ఉపాధ్యాయుల శిక్షణలో ఇలాంటి కళలకు స్థానం ఏర్పరచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అర్థం పర్థం లేని రణగొణధ్వని లాంటి శబ్దాన్ని సంగీతం పేరిట నేపథ్యంలో పెట్టి, చిన్న చిన్న పిల్లలచేత అసంఖ్యాకంగా దేహాన్ని వంకర్లు తిప్పించి, ఇదే నాట్యమని పాఠశాల వేడుకలలో ప్రదర్శింపజేస్తుంటే వారి తల్లితండ్రులు అది చూసి మురిసి పోతున్నారు.

వేళ్ళూనుకొన్న అవినీతి, అన్యాయం: సర్వత్రా వ్యాపించి, లోతుగా వేళ్ళూనుకొన్న అవినీతి యువతరం మనస్సులకు చాలా హాని కలిగిస్తోంది. సక్రమంగానో, అక్రమంగానో ఎలాగో ఒకలా ధనమార్జించడమే సమాజ ధ్యేయంగా కనబడుతోంది.

రాజకీయ నాయకులు అసత్యాలు పలకడం, వారిలో నిజాయతీ లేమి, దయా రాహిత్యం, ఏదో ఒక విధంగా గెలుపు సాధించాలనే తత్త్వం, సేవా నిరతి లేమి, స్వార్థం దేశంలో నైతికతను ఛిద్రం చేస్తున్నాయి. వీటికి తోడు భూసామ్యపెత్తందారీ మనస్తత్వం (ఫ్యూడల్ మనస్తత్వం) మూలంగా పెద్దలు, ధనవంతులు, ఉన్నత పదవులలో ఉన్నవారు చేసిన నేరాలకు శిక్ష పడకుండా జాగ్రత్తలు పడి తప్పించుకొంటున్నారు. భూస్వామ్య ధోరణి నశించాలని స్వామి రంగనాథానంద మహరాజ్ పదే పదే వక్కాణించేవారు. పెరిగిన అవినీతి సమాజంలో యువతరం మనస్సును పాడుచేసి, వారిని కూడా అవినీతి పరులను చేస్తోంది. లేదంటే వారిలో నిరాశావాదం, నిస్పృహ, నిర్లిప్తతలను పెంచుతోంది.

పాశ్చాత్యులకు నీతి నియమాలు తక్కువనీ, కనుక ఈ దుష్ఫలితాలు వారు అనుభవిస్తున్నారనీ, భారతీయులం మనం నైతికతకు ప్రాధాన్యత ఇస్తాం కాబట్టి మనం ఈ విషయంలో పాశ్చాత్యుల కన్నా ఉన్నతులమనే ఒక అహంకార ధోరణి మనకుంది. ఈనాడు పాశ్చాత్యులను అనుకరించడంలో అన్ని దేశాల కన్నా మనమే ముందున్నాం. అయితే పాశ్చాత్యులలోని మంచి లక్షణాలైన క్రమశిక్షణ, నిజాయతీ, నిజమైన ప్రజాస్వామ్య పోకడలు మాత్రం మనం నేర్చుకోవడమే లేదు.

పిల్లల్ని తీర్చిదిద్దాల్సింది పెద్దలే! : శీల నిర్మాణానికి పునాది వేయగలిగినవారు, వేయవలసినవారు తల్లితండ్రులు, తాత నాయనమ్మలు! వడివడిగా మార్పులు చెందుతున్న సాంకేతిక యుగంలో తమ పాత్ర ఏమిటో వారికి అంతు చిక్కడం లేదు. కాబట్టి, ముందస్తుగా వీరికే ఆధ్యాత్మిక శిక్షణ, ఆత్మబలం అవసరం. ఈనాడు యువతరంలో చాలా మంది యోగాభ్యాసానికీ, ధ్యానం నేర్చుకొనటానికీ పలువురు గురువుల వద్దకు వెళుతున్నారు. అయితే ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు చాలామటుకు శారీరక దారుఢ్యానికి ఉపయోగపడుతున్నాయే కానీ ఆధ్యాత్మిక విలువలను అందించడం లేదు.

నేటి పరిస్థితుల్లో శీల నిర్మాణ విద్య ఏటికి ఎదురీత లాంటిది. ఆధునిక నాగరకతలోని ఒత్తిళ్ళను తట్టుకొనే ఆధ్యాత్మిక బలం పిల్లలకు అందించకపోతే వారిని ఈ నాగరకత బలిగొంటుందని పరమపూజ్యులు స్వామి రంగనాథానందజీ మహరాజ్ చెప్పేవారు. ఆ మాటల్లోని వాస్తవం మనకు నేడు కళ్ళకు కట్టినట్లు కనపడుతోంది.

పిల్లలు సహజంగా దుష్ప్రవర్తకులు కారు. నేడు వారు ఎదుర్కొంటున్న సమస్యలన్నిటికీ పెద్దలే కారణం. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో సైతం అధికాంశం పిల్లలు మంచి శీలం కలిగి ఉంటున్నారు. అయితే సామాజిక ఒత్తిళ్ళను తట్టుకొనేందుకు వారికి ఒక ఆలంబన అవసరం. విద్యాసంస్థలు ఈ ఆలంబనను ఇచ్చే



స్థితిలో లేవు. నేటి విద్యా విధానంలో విద్యార్థుల మెదళ్ళను పనికిరాని సమాచారంతో ఎక్కువగా నింపుతున్నారని స్వామి వివేకానంద చెప్పారు. ఆయన కాలానికీ, నేటికీ పరిస్థితి ఇంకా దారుణంగా దిగజారింది. పాఠశాలల యాజమాన్యాలు ధనార్జనలోనూ, అధికశాతం విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా చూడడంలోనూ తలమునకలై ఉన్నాయి. ఇలాంటి విద్యాలయాలలో ఎంత మంచి ఉపాధ్యాయులైనా నిస్సహాయులే. ఆరోగ్య రక్షణ మాదిరిగానే విద్యాబోధనను కూడా వ్యాపార సంస్థలు తమ స్వార్థప్రయోజనాలకు ఉపయోగిస్తుంటే ప్రభుత్వం మిన్నకున్నది. అంతేగాక అది లౌకిక (సెక్యులర్) విధానమని చెప్పుకుంటూ, విద్యాబోధనలో నీతిబోధనకు తావు లేకుండా చేసింది ప్రభుత్వం. మరొక వైపు మత సంస్థల నిర్వహణలోని విద్యాసంస్థల విద్యార్థులు మతఛాందసులుగా తయారవుతున్నారు. పాఠశాలలలో నీతి బోధన ఆవశ్యకతను తల్లితండ్రులు కూడా గ్రహించడం లేదు. మంచి వేతనాలు లభించే కోర్సులలో తమ పిల్లలు స్థానం సంపాదిస్తే చాలనే భావం వీరిది.

చాలామంది యువతీ యువకులు దేశాభివృద్ధి, జాతి నిర్మాణాల పట్ల శ్రద్ధ చూపుతున్నారు. ఇందులో ఉడతాభక్తిగానైనా తాము పాలుపంచుకోవాలని ఉత్సాహం చూపుతున్నారు. ఇది ముదావహం. శీలనిర్మాణ పునాదులు పూర్తిగా సడలిపోలేదనేందుకు ఇది నిదర్శనం. ఆధ్యాత్మిక బోధన ద్వారా దీనిని మరింత పటిష్ఠం చేయవచ్చు. తెగులు పట్టిన పండును చూసి, ఆ వృక్షం శక్తిసామర్థ్యాలను అంచనా వేయకూడదన్నారు స్వామి వివేకానంద. పారంపర్యంగా అందివస్తున్న సాంస్కృతిక ఆచార వ్యవహారాల వేళ్ళు మన సమాజంలో ఇప్పటికీ పటిష్ఠంగానే ఉన్నాయని చెప్పవచ్చు. ఆధ్యాత్మిక బోధనలను వాస్తవిక ధోరణిలో స్వీకరించే స్థితిలో మన సమాజం ఉంది. కాబట్టి, పిల్లలు కూడా మంచి శిక్షణను గ్రహించే స్థితిలోనే ఉన్నారు. రామకృష్ణ మఠం వంటి ఆధ్యాత్మిక సంస్థలు బాలల వికాస తరగతులు నిర్వహిస్తున్నాయి. పిల్లలతో పాటు తల్లితండ్రులకు కూడా అంతర్యోగ శిబిరాలు నిర్వహించడం అవసరం. శీలనిర్మాణంలో ఆధ్యాత్మిక శిక్షణ ఆవశ్యకతను తల్లితండ్రులు గ్రహించవలసిన అవసరమే ఇక ఎంతైనా ఉంది. ❖

శ్రీ రామకృష్ణా యాత్ర సర్వీసెస్

యస్.ఆర్.కె. టూర్స్ & ట్రావెల్స్, హెడ్ ఆఫీస్ 120/1, ఓల్డ్ నెం:216/1, రామకృష్ణ మఠం రోడ్, (శ్రీ రామకృష్ణ మఠం ఎదురుగా)
మైలాపూర్, చెన్నై-600 004. ఫోన్ : 044-24616968, సెల్ : 94431 44808 / 94440 91428
ఫ్యాక్స్ : 044-24620631, Email : srk.yatraservices@gmail.com ; gs.anandhan@yahoo.in
విజయవాడ ఫోన్ : 0866-2578047, సెల్ : 94906 35158

యాత్రికులకు శుభవార్త

1. శ్రీ రామకృష్ణ యాత్ర	:	కలకత్తా బేలూరు మఠం గురుపీఠ దర్శన్, కామార్పుకూర్, జయరాంబాటీ మరియు కలకత్తా పరిసర ముఖ్య ప్రదేశాలు - 7 రోజుల యాత్ర.
2. కైలాస మానస సరోవర యాత్ర	:	మే-ఆగష్టు మాసాల్లో (ఖాట్మాండు నుండి ఖాట్మాండు వరకు) కైలాస మానససరోవర యాత్ర ఎకోట్రెక్ నేపాల్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడును. నేపాల్, పశుపతినాథ్, ముక్తినాథ్, మనోకామన శక్తి పీఠం ప్రదేశములు ప్రత్యేకంగా దర్శించుటకు ఏర్పాటు చేయబడును-16 రోజుల యాత్ర.
3. కాశీయాత్ర	:	పూరీ, భువనేశ్వర్, కోణార్క్, గయా, కాశీ, అలహాబాద్-14 రోజుల యాత్ర.
4. బృందావన యాత్ర	:	మథుర, బృందావన్, గోవర్ధన గిరి పరిక్రమ, అయోధ్య, కాశీ, అలహాబాద్-12 రోజుల యాత్ర.
5. చార్‌ధామ్ యాత్ర	:	ఢిల్లీ, హరిద్వార్, హృషీకేశ్, బద్రీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి-14 రోజుల యాత్ర.
6. అమర్‌నాథ్ యాత్ర	:	అమర్‌నాథ్ మరియు వైష్ణోదేవి యాత్ర ఏర్పాటు చేయబడును.
7. నవ జ్యోతిర్లింగ యాత్ర	:	వైద్యనాథ్, నాగేశ్వర్, ఘృష్ణేశ్వర్, త్ర్యంబకేశ్వర్, భీమశంకర్, సోమేశ్వర్, మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, మల్లికార్జున-16 రోజుల యాత్ర.
8. సింధుదర్శన్ యాత్ర	:	సింధునది పుష్కరాల సందర్భంగా సింధుదర్శన్ యాత్ర చేయబడును.

చెన్నై నుండి తమిళనాడు మరియు కేరళ యాత్ర ఏర్పాటు చేయబడును.
కొత్త పాస్‌పోర్టునకు, పాస్‌పోర్ట్ రెన్యూవల్‌నకు, విమాన టిక్కెట్లు/రైలు/బస్సు టికెట్లు, వీసా, డొమెస్టిక్/ ఇంటర్‌నేషనల్ సర్వీసులకు సంప్రదించండి.

మలేషియా, సింగపూర్, థాయ్‌లాండ్, హాంగ్‌కాంగ్, శ్రీలంక, అండమాన్-నికోబార్ దీవుల యాత్రలు ఏర్పాటు చేయబడును.

సదా మీ సేవలో
(ఆధ్యాత్మిక సేవా పరాయణుడు) జి.యస్. ఆనందన్

ADVT.

మనసును ఎందుకు నియంత్రించాలి?

సాధారణంగా మన మనసు మన చుట్టూ ఉండే వస్తువుల మీద లేదా వ్యక్తుల మీద లగ్నమవుతుంది. ఆ వస్తువులలో ఉండే ఆకర్షణలు మనసును ప్రలోభపెట్టి మనల్ని ఆయా వస్తువులకు బానిసలుగా మారుస్తాయి. మనం పరిస్థితుల ప్రభావానికి లొంగకుండా ఉండాలంటే మనసుపై పట్టు సాధించాలి. అలా కాకుండా పరిస్థితుల ప్రభావానికి మనసు లోనైతే ఏ కార్యాన్నీ సాధించలేం.

మనసుపై ఆధిక్యతను సాధించడం ఎలాగో చూద్దాం. స్వామి వివేకానంద ఇలా బోధించారు:

“ప్రపంచమంతటా ‘మంచిగా ఉండు! మంచిగా ఉండు! మంచిగా ఉండు!’ అని బోధించడాన్ని మనం వింటూనే ఉంటాం. ఏ దేశంలోనైనా సరే, ‘దొంగతనం చెయ్యవద్దు! అబద్ధం చెప్పవద్దు!’ అని చెప్పించుకోని పిల్లవాడు లేడంటే అతిశయోక్తి కాదు. అయితే ఎవరూ ఆ పిల్లవాడికి దొంగతనం ఎందుకు చెయ్యకూడదో చెప్పరు. వాడు దొంగ ఎందుకు కాకూడదో, దొంగతనం చెయ్యకుండా ఉండడం ఎలాగో నేర్పించకుండా కేవలం ‘దొంగతనం చెయ్యవద్దు!’ అని ఊరకే మాటలు చెప్పినంత కాలం ఆ పిల్లవానిలో మార్పుని తీసుకురాలేం. ఎప్పుడైతే పిల్లవాడికి దొంగతనం చేయడం వల్ల నష్టాల్ని వివరిస్తామో అప్పుడు మాత్రమే వాడు మంచిగా ఉండడానికి ప్రయత్నిస్తాడు”.

మనసును నియంత్రించక పోవడం వల్ల కలిగే అనర్థాలను ముందుగా తెలుసుకుంటే సులభంగా మనసును స్వాధీనపరచుకోవచ్చు.

మనసు, అవయవాలనే కొన్ని కేంద్రాలతో తనను తాను అనుసంధానం చేసుకున్నప్పుడు మాత్రమే అన్ని పనులూ జరుగుతాయి. ఇష్టపూర్వకంగా కానీ, అనిష్టంగా కానీ మనసు ఆ కేంద్రాల వైపు లాగబడుతుంది. అలాంటప్పుడు మనసును నియంత్రించుకోలేకపోతే అనర్థాలను ఎదుర్కోవలసి వస్తుంది.

వస్తువిషయాలకూ, ఇంద్రియాలకూ అనుసంధానకర్త మనసు. ఎప్పుడైతే మనసును వస్తువుల నుంచి వెనక్కి మరలిస్తామో, అప్పుడు ఇంద్రియాలు కూడా మనసును అనుసరించి తమను తాము వెనక్కి మరల్చుకుంటాయి. కాబట్టి మనసు స్వాధీనమైనప్పుడు బయటకు వెళ్ళే ఇంద్రియాలు వాటంతట అవే స్వాధీనమవుతాయి. దీనికి ఒక ఉదాహరణ చెప్పవచ్చు.

తేనెటీగలు తమ రాణీ ఈగను అనుసరించిపోవడం మనమందరం చూస్తాం. రాణీ ఈగ పైకెగిరితే మిగిలిన ఈగలన్నీ ఎగురుతాయి. రాణీ ఈగ వాలితే అవన్నీ దాన్ని అనుసరిస్తాయి. ఇదే విధంగా మనస్సనే రాణీఈగ స్వాధీనమైనప్పుడు ఇంద్రియాలనే ఈగలన్నీ మనసు చెప్పినట్లు చేస్తాయి.

ఇంద్రియాలను వస్తువుల సంపర్కంలోకి రాకుండా నిరోధించి మనసును అవి అనుసరించేలా చేయడమే ప్రత్యాహారం అంటారు.

మనసుని నిగ్రహించడం సంకల్పశక్తి మీద ఆధారపడి ఉంటుంది. సంకల్పశక్తి గలవారు ఎలాంటి ఉద్రేకాలకూ లొంగకుండా అనుకున్న కార్యంలో విజయాన్ని సాధిస్తారు. ❖

With Best Compliments From

PENNAR INDUSTRIES LIMITED

305, Saptagiri Towers, Begumpet, Hyderabad - 500 016

పెన్నార్ కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.

పరిపూర్ణతనిచ్చే స్వామీజీ సందేశం !

– కె. శంకరయ్య

విశ్వమత మహాసభలో స్వామీజీ ప్రసంగించి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా 1993లో బేలూరు మఠం (కలకత్తా)లో ఒక జాతీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఆ సమ్మేళనంలో పాల్గొనడానికి వివరాలు తెలుసుకోవడం కోసం హైదరాబాద్ రామకృష్ణ మఠానికి వెళ్ళాను. కానీ అప్పటికే అధిక సంఖ్యలో భక్తులు పేర్లను నమోదు చేసుకోవడం వల్ల నాకు కలకత్తా సమ్మేళనంలో పాల్గొనడానికి అవకాశం లేదన్నారు. అప్పుడు నేను చాలా బాధపడుతూ ఇంటికి తిరిగి వెళ్ళాను. కానీ, ఏం జరిగిందో ఏమో అదే రోజు రాత్రి 'సమ్మేళనంలో పాల్గొనడానికి మీ పేరు నమోదు చేసుకోండి' అని రామకృష్ణ మఠం నుంచి ఫోన్ వచ్చింది. ఆ సంతోషకరమైన వార్త వినగానే భగవంతుడు నా మొర విన్నాడని తెలిసి నా కళ్ళు చెమ్మగిల్లాయి. అలా 1993లో కలకత్తా సమ్మేళనంలో పాల్గొనే భాగ్యం కలిగింది.

స్వామీజీ జీవిత చరిత్రను తొలిసారిగా 1973లో చదివాను. 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1975 నుంచి నెలనెలా చదువుతున్నాను. చదవడమేకాక 33 ఏళ్ళ నుంచి ఎంతోమంది విద్యార్థులు, ఉపాధ్యాయులచేత చదివిస్తున్నాను. పదవీ విరమణ తరువాత ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువకులచేత స్వామీజీ సాహిత్యాన్నీ, 'శ్రీరామకృష్ణ ప్రభ'నూ చదివించాలని కృషి చేస్తున్నాను. రామాయణంలోని ఉడుతలా నా శక్తి మేరకు మూర్తిత్రయ సాహిత్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నాను. 35 సంవత్సరాలు ఉన్నతమైన ఉపాధ్యాయ వృత్తిలో పనిచేసిన నాకు ఆదర్శంగా మెలగడానికీ, ఏది మంచో, ఏది చెడో వివరించడానికీ, పాఠ్యాంశాలతో పాటు నైతిక, ఆధ్యాత్మిక విలువల్ని కూడా బోధించడానికీ స్వామీజీ సాహిత్యం ఎంతగానో తోడ్పడింది.

"భారతదేశాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలంటే స్వామీజీ సందేశాన్ని చదవాలి" అన్న విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ మాటలు నిత్యసత్యాలు. యువతీ యువకులు స్వామీజీ సందేశాన్ని చదివితే పరిపూర్ణ వ్యక్తులుగా తయారవుతారనడంలో సందేహం లేదు. ❖

కె. శంకరయ్య, మాసైపేట్, మెదక్ జిల్లా.

'స్ఫూర్తి భావనలకు స్వాగతం'

జీర్ణమయిన దుస్తుల్ని త్యజించినట్లు ఈ శరీరాన్ని త్యజించినా నా భావాలతో ముందు తరాలను నిరంతరం చైతన్య పరుస్తూనే ఉంటాను అనేవారు స్వామి వివేకానంద. విశ్వానికే ఆత్మవిశ్వాసాన్ని ప్రబోధించిన యుగపురుషుడాయన. ఆబాల గోపాలాన్నీ ఉత్తేజపరిచే ఉత్తుంగ చైతన్య సాగరం స్వామీజీ.

స్వామి వివేకానంద ఈ ప్రపంచం నుంచి భౌతికంగా నిష్క్రమించి ఒక శతాబ్దం అయినా వారి స్ఫూర్తి మాత్రం ఆచంద్రార్కం మనల్ని మేల్కొలుపుతూనే ఉంటుంది. అలా ఆ మహనీయుని జీవితంతో ఉత్తేజితులైన వారి అనుభూతులకు, అనుభవాలకు 'శ్రీరామకృష్ణ ప్రభ' స్వాగతం పలుకుతోంది.

స్వామి వివేకానంద జీవితంలోని ఒక సంఘటన కావచ్చు, సంభాషణ కావచ్చు.... ఉత్తరం కావచ్చు, ఉపన్యాసం కావచ్చు... ఏదైనా మిమ్మల్ని మహత్తరంగా ప్రభావితం చేసి ఉంటుంది. ఆ అనుభూతిని, అనుపమానమైన స్ఫూర్తిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులతో పంచుకోండి.

సమస్యల సాగరంలో చిక్కుకొని చుక్కాని లేని అగమ్యగోచరమైన నేటితరానికి స్వామి వివేకానంద సాహిత్యం ఆశాదీపమని మీ అనుభవాలు నిరూపిస్తాయి. మీ అనుభవాలను, అనుభూతులను వ్రాసి మీ ఛాయాచిత్రం (కలర్ ఫోటో)తో సహా పంపిస్తే 'నా జీవితంలో స్వామి వివేకానంద' అనే శీర్షికలో ప్రచురిస్తాం.



మీ అనుభవాలను, భావనలను పంపవలసిన చిరునామా
'నా జీవితంలో స్వామి వివేకానంద'
శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం,
దోమల్‌గూడ, హైదరాబాద్ – 500 029

ధరణిపై వెలసిన దేవత

ఈ సంఘటన 1921లో జపాన్‌లోని 'గోఫు' అనే గ్రామంలో జరిగింది:

కియోకో అనే మహిళ అనారోగ్యంతో ఉన్న తన భర్తను వైద్యుని దగ్గరకు తీసుకువెళ్ళింది. రోగిని పరీక్షించాక ఆ వైద్యుడు 'నీ భర్తకి కుష్ఠువ్యాధి వచ్చింది' అని చెప్పాడు. అది వినగానే కియోకో నిశ్చేష్టురాలైంది. తన భర్తకు అతనికి వచ్చిన వ్యాధి గురించి తెలియనీయకుండా తన మామగారికి విషయమంతా వివరించింది. అది విన్న ఆమె మామగారు "కుష్ఠువ్యాధికి గురైన నా కుమారుడి వల్ల నీ జీవితం కష్టాలపాలైంది" అన్నారు.

1921 మే నెలలో కియోకో తన భర్తతో పాటు గ్రామానికి దూరంగా ఒక ఇల్లు అద్దెకు తీసుకొని భర్తకు సేవలు చేస్తూ జీవితాన్ని కొనసాగిస్తుండేది. కియోకో భర్తకు కుష్ఠు వ్యాధి అని అక్కడ గ్రామస్థులకు తెలియగానే వారంతా భయపడి, వారిని అక్కడ నుంచి వెళ్ళిపోమన్నారు. అప్పుడు కియోకో అక్కడకు చాలా దూరంలో ఉన్న తమ స్వగ్రామం వెళ్ళిపోవాలని నిర్ణయించుకుంది. వాళ్ళిద్దరూ రైలు ఎక్కగానే కియోకో భర్త కుష్ఠు వ్యాధిగ్రస్థుడని తెలిసి తోటి ప్రయాణికులంతా భార్యాభర్తల్ని రైల్లో నుంచి దిగిపొమ్మన్నారు. పక్కస్టేషన్‌లో ప్రయాణికులందరూ కలిసి వీరిద్దర్నీ బలవంతంగా రైల్లో నుంచి దింపేశారు. కియోకో స్టేషన్ మాష్టర్‌ని కలిసి రైల్లో తమ స్వగ్రామం చేరనీయమని వేడుకుంది. స్టేషన్ మాష్టర్ "రైల్వే నిబంధనల ప్రకారం దీర్ఘ వ్యాధులతో బాధపడుతున్న వాళ్ళు రైలు ప్రయాణానికి అనర్హులు" అని చెప్పి, ఆమె అభ్యర్థనను నిరాకరించాడు.

కియోకో స్వగ్రామం అక్కడకు 700 కిలోమీటర్ల దూరంలో ఉంది. అంత దూరం వ్యాధిగ్రస్థుడైన భర్తతో కాలినడకన వెళ్ళడం అసాధ్యం. బజారుకు వెళ్ళి ఒక పాత సైకిల్ రిక్షా కొన్నది. కొన్ని దుప్పట్లు కూడా కొన్నది. భర్తను రిక్షాలో కూర్చోబెట్టి, దుప్పట్లు కప్పి సైకిల్ తొక్కుతూ ప్రయాణం ప్రారంభించింది ఆ ధీరవనిత. విపరీతమైన చలి, అపరిచిత ప్రదేశాలు, ఇంకా అనేకమైన ఇతర ఇబ్బందులు ఒకవైపు నుంచి బాధిస్తే, ఎవ్వరి నుంచీ ఏ విధమైన సహాయ సహకారాలు లేకపోవడం మరోవైపు నుంచి బాధించసాగాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో 700 కిలోమీటర్ల ప్రయాణం చేసినప్పుడు మరెన్ని కష్టాలు ఎదురవుతాయో మనం ఊహించాల్సిందే! ఆమె తన శక్తినంతటినీ కూడగట్టుకుని రోజుకు 10-15 కిలోమీటర్లు సైకిల్ తొక్కేది. దోవలో ఆమె అనుభవించిన బాధలకు అంతు లేదు. అన్ని బాధల్నీ సహించి 1922 జనవరి చివర్లో స్వగ్రామానికి చేరింది ఆమె.

కియోకో పరిస్థితి తెలిసిన ఆమె తల్లితండ్రులు ఎంతో దుఃఖించారు. ఆమెను ఇంటికి తీసుకురమ్మని తమ కుమారుణ్ణి పంపించారు. "దైవ నిర్ణయం ప్రకారం మా బాంధవ్యం ఏర్పడింది; ఇప్పుడు నా భర్తను ఈ స్థితిలో విడిచిపెట్టడం అపరాధం. భార్యగా ఆయనకు సేవలందించడం నా కర్తవ్యం" అని తన సోదరునితో చెప్పి పంపించింది. కుష్ఠు వ్యాధితో ఉన్న కియోకో భర్తను చూసి ఇరుగు పొరుగు వారు భయపడసాగారు. కియోకో మాత్రం ఒక సంపూర్ణమైన ఆరోగ్యవంతునితో మెలిగినట్లే ప్రవర్తించేది. ఎవరూ తాకడానికి కూడా ఇష్టపడని అతని బట్టలు ఉతకడం, అతనికి తినిపించడం, అతనికి నిద్రపట్టకపోతే గంటల తరబడి



అతనితో మాట్లాడడం, అతని దేహం శుభ్రం చేయడం-ఇలా విసుగు, విరామం లేకుండా భర్తకు అన్ని సేవలూ ప్రేమతో చేసేది.

శక్తికి మించి శ్రమపడడం వల్ల దురదృష్టవశాత్తూ 1924లో ఆమె కుంటిది అయింది. అయితే అది ఆమె భర్తకు చేస్తున్న సేవలకు ఎలాంటి ప్రతిబంధకమూ కాలేదు. ఒక కర్ర సహాయంతో రోజూ సాయంకాలం తన భర్తను ఒక బండిలో కూర్చోబెట్టి బయటకి తీసుకుని వెళ్ళి తిప్పి తీసుకువచ్చేది. కియోకో తన భర్తకు చేస్తున్న ప్రేమపూర్వక సేవలను చూసి అక్కడి ప్రజలందరూ ఆమెను దేవతగా భావించి గౌరవించేవారు. జీవిత సర్వస్వాన్ని భర్త సేవకే నివేదించిన కియోకో నిజంగానే 'ధరణిపై వెలసిన దేవత'. ❖

...17వ పేజీ తరువాయి.


7
హఠాత్తుగా వర్షం ముంచుకొచ్చింది. బుద్ధుని ప్రతిమను పరదాలతో కప్పినా ప్రయోజనం లేకపోయింది. ప్రచండ వేగంతో గాలులు వీచసాగాయి. ప్రజలందరూ నలుదిక్కులకూ చెదరిపోయారు. ప్రతిమ మాత్రం వర్షంలో తడుస్తోంది. వారి అధ్యక్షునికీ ఇతర భిక్షువులకూ ఏం చెయ్యాలో తోచక నిశ్చేష్టులై పోయారు.
అయ్యో! బుద్ధ భగవానుని విగ్రహం కరిగిపోయేలా ఉందే! నేను ఈ దృశ్యాన్ని చూడలేకపోతున్నాను! భగవంతుడా! ఎన్నో శతాబ్దాలుగా పెద్దలు ఆరాధిస్తూ వచ్చిన మీ విగ్రహాన్ని కాపాడలేకపోయానే!
మనందరం కలిసి బుద్ధ భగవానుణ్ణి ప్రార్థిద్దాం. ఆయన మనల్ని ఈ విపత్తు నుంచి తప్పకుండా ఆదుకుంటాడు.
అందరూ కలసి ప్రార్థన చేయసాగారు.
8
విగ్రహం క్రమంగా కరుగుతోంది. భిక్షువుల కళ్ళు చెమ్మగిల్లాయి. అప్పుడు ఒక అద్భుతం జరిగింది.
అయ్యో! మన కళ్ళ ముందే భగవంతుని ప్రతిమ కరిగిపోతోంది!
ఆహా! ఇదేం ఆశ్చర్యం! భగవంతుని విగ్రహం బంగారంలా ప్రకాశిస్తోందే! రండి! దగ్గరకు వెళ్ళి చూద్దాం!
9
అయ్యా! మట్టి ప్రతిమలాగ ఉండే భగవానుడు బంగారు విగ్రహంగా బయట పడుతున్నాడు.
అవును! బంగారు బుద్ధుడే! మట్టి విగ్రహం లోపల స్వర్ణ విగ్రహమా!







'తాను ఆరాధించే దేవతా విగ్రహాలు నిజంగానే దివ్యత్వం కలవి' అని విశ్వసించే వాడు దివ్యత్వాన్ని పొందుతాడు. కానీ ఆ విగ్రహాలు కేవలం రాయి, ఇత్తడి అని అనుకునేవాడు అర్చన ద్వారా ఎలాంటి లాభాన్నీ పొందలేడు.

– శ్రీరామకృష్ణ పరమహంస

గ్రంథ పరిచయం

ద్వాదశ నారసింహ క్షేత్రదర్శిని



రచన : డాక్టర్ చల్లా సత్యవాణి
పేజీలు : 188, వెల: రూ.80/-
ప్రాప్తిస్థానము: ప్రణవకుటి, 46-18-11, దానవాయిపేట, రాజమండ్రి.

ప్రహ్లాద, నారద, పరాశర, పుండరీక వరదుడైన శ్రీనరసింహ స్వామి వెలసిన క్షేత్రాలకు సంబంధించిన పురాణాంశాల్నీ, చారిత్రకాంశాల్నీ, ఏయే మహనీయులు ఆ క్షేత్రాలను దర్శించి మోక్షాన్ని పొందారో వివరాల్నీ శ్రీమతి సత్యవాణి గారు ఈ గ్రంథంలో స్పష్టంగా తెలియజేశారు. అంతేకాకుండా నారసింహ భక్తులకు యాత్రికులకు ఆయా క్షేత్రాలకు చేరటానికి ప్రయాణం చేయవలసిన విధానం బస్సు, రైలు, మార్గాల వివరాలు, వసతి, భోజనం, ఏర్పాట్లు సౌకర్యాలు పట్టికగా అనుబంధంగా చేర్చి ప్రయాణాన్ని సులభతరం చేశారు. ఇంత చక్కని యాత్రారచనను తెలుగువారికి అందించిన సత్యవాణిగారు అభినందనీయులు. - ఎమ్.వి. నాగప్రసాద్

లక్ష్మీపుర నరహరి కీర్తనలు



రచయిత : కపిలవాయి లింగమూర్తి
పేజీలు: 52, వెల : రూ. 30/-
ప్రాప్తిస్థానం : కె. కిశోర్ బాబు, వాణీ సదనం, 17-110, విద్యానగర్ కాలనీ, నాగర్‌కర్నూలు-509 209.

బాపూజీ గీతా సందేశం

స్వేచ్ఛానువాదం : రావినూతల శ్రీరాములు
పేజీలు : 48, వెల : రూ. 20/-
ప్రతులకు: రావినూతల శ్రీరాములు రమణస్థాన్, 10/228, వసంతపురి కాలనీ, మల్కాజ్‌గిరి, హైదరాబాద్ - 500 047

విజేత

రచన : మేడిచర్ల ప్రభాకర రావు
పేజీలు : 78, వెల : రూ. 30/-
ప్రతులకు : గీతా భవనము, స్టేషన్‌రోడ్, నిజామాబాద్

శ్రీరామకృష్ణ గానలహరి

రచన: స్వామి అనుభవానంద
వెల: రూ. 50/-

శివకేశవుల అంశలతో జన్మించిన శ్రీరామకృష్ణులు జగద్గురువుగా అందరిచేతా కీర్తింపబడిన దివ్యపురుషుడు. వారి అనుయాయులు స్వామి అనుభవానందులవారు. శ్రీ శారదారామకృష్ణులపై అనేక కీర్తనలను భక్తి ప్రపత్తులతో రచించారు స్వామి అనుభవానంద. ఆ కీర్తనలలో కొన్ని మొదట "శ్రీరామకృష్ణ గానసుధ" పేరుతోనూ, రెండవ మారు "శ్రీరామకృష్ణ గానామృతం" పేరుతోనూ, 2 సిడిలుగా విడుదల అయ్యాయి. ఇప్పుడు స్వామి అనుభవానందులవారి శతజయంతి సందర్భంగా (1908-2008) "శ్రీరామకృష్ణ గానలహరి" పేరుతో ఒక సీడిని విడుదల చేశారు. ❖

ఈ సి.డి.లను పొందగోరే వారు క్రింది చిరునామాను సంప్రతించండి.
శ్రీ రామకృష్ణ భక్త సమాజం
11-1-13, యం.జి.రోడ్, బాపట్ల - 522 101
ఫోన్:94404 49355, 92472 99837

శ్రీ వివేకానంద చరితామృతం

రచన: శ్రీ అనుభవానంద స్వామి
వ్యాఖ్యానం : శ్రీ మాతాజీ త్యాగీశానంద
వెల : రూ॥100/-, (రెండు సి.డి.లు)

మనదేశ ఔన్నత్యాన్నీ, ఆధ్యాత్మిక జీవిత వైశిష్ట్యాన్నీ, మత ప్రాశస్త్యాన్నీ పాశ్చాత్య దేశాలలో చాటిన యుగ ప్రవక్త స్వామి వివేకానంద. "నా దేశం తన పూర్వ ప్రతిభను పొందే వరకూ విశ్రమించను" అని కంకణం కట్టుకుని యావత్ ప్రపంచాన్నీ ఒక ఊపు ఊపిన దివ్యశక్తి స్వామీజీ. అంతటి దివ్యశక్తి సంపన్నుడి సందేశాన్నీ, ప్రతిభా పాటవాలనీ యువతరాల వారికి అందించాల్సిన బాధ్యత మనందరిదీ! స్వామీజీ జీవితంలోని మహత్కార్యాలనన్నిటినీ కథా-గాన రూపంలో రచించారు స్వామి అనుభవానంద. శ్లోకాలతో పద్యాలతో పాటలతో చెవులకింపుగాసాగే ఈ కథాగానాన్ని రెండు సిడిల ప్యాక్‌గా "శ్రీవివేకానంద చరితామృతం"పేరిట విడుదల చేశారు.

శ్రీమాతాజీ త్యాగీశానందవారి వ్యాఖ్యానంతో, శ్రీ బండారు చిట్టిబాబుగారి సంగీత పర్యవేక్షణలో 'శ్రీరామకృష్ణ గానలహరి' 'శ్రీవివేకానంద చరితామృతం' డా॥ ఎమ్.శారద, శ్రీమతి ఎస్.చంద్రమణి, శ్రీమతి ఎమ్. విమల మొదలైన గాయనీ గాయకులు సుమధురంగా గానం చేశారు. సరళమైన తెలుగులో మధురంగా సాగిన ఈ రెండు సి.డి.లు ప్రతీ ఒక్కరికీ వీనుల విందు చేస్తాయనడంలో సందేహం లేదు.❖- శ్రీమతి ఎస్. శేషు

రామకృష్ణ మిషన్ కేంద్రాల సంక్షేమ కార్యక్రమాలు

వరద బాధితులకు సహాయం : ఫిజీ, బీహార్, ఒరిస్సా రాష్ట్రాల్లోని వరద బాధితులకు ఫిజీ, భువనేశ్వర్, పాట్నా రామకృష్ణ మిషన్ కేంద్రాలు సహాయక చర్యలు చేపట్టాయి.

ఫిజీ రామకృష్ణ మిషన్ విటిలేవు పట్టణంలో వరదలకు గురైన విద్యార్థులకు 1,886 పాఠ్యపుస్తకాలు, 4,018 లేఖన సామాగ్రి, 421 గణవేషలను (యూనీఫారాలను) పంపిణీ చేసింది. 398 మంది విద్యార్థులకు పాఠశాల రుసుము చెల్లించింది.

భువనేశ్వర్ రామకృష్ణ మిషన్ కటక్, పూరీ ప్రాంతాలలో వరదలకు గురైన విద్యార్థులకు 3,612 పాఠ్యపుస్తకాలు, లేఖన సామాగ్రి, గణవేషలను (యూనీఫారాలను) పంపిణీ చేసింది.

పాట్నా రామకృష్ణ మిషన్ వరద బాధితులకు 2,611 చీరలు సరఫరా చేసింది. 10,16,600 మంది రోగులకు వైద్య సేవల్ని అందించింది.

నేత్రవైద్య సేవలు : బెల్‌గామ్, చండీఘర్, లక్నో, ముంబయి, పోర్‌బందర్, రాజ్‌కోట్, సేలం, సిక్రా కులింగ్రామ్, అల్వార్, సిల్‌చార్, వడోదర రామకృష్ణ మిషన్ కేంద్రాలు 2009 మార్చి నెలలో ఉచిత వైద్య శిబిరాల్ని నిర్వహించాయి. ఈ శిబిరాల్లో 3,191 మంది చికిత్స పొందారు. 759 మందికి శస్త్రచికిత్సలు జరిగాయి.

బీదలకు సహాయం : బెల్‌ఘరియా రామకృష్ణ మిషన్ 6,307 మంది నిరుపేదలకు చీరలు, ధోవతులు పంపిణీ చేసింది. ❖

స్వామి వివేకానంద విగ్రహావిష్కరణ

హైదరాబాద్ సాంస్కృతిక, సంక్షేమ సంఘం అశోక్‌నగర్ పార్క్‌లో నెలకొల్పిన స్వామి వివేకానందుని విగ్రహాన్ని హైదరాబాద్ రామకృష్ణ మఠం స్వామి గౌరంగానందజీ 2009 మార్చి 15న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ హైందవ సమాజ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు వివేకానందుడనీ, ఆయన బోధనలు సర్వ మానవాళికి ఆదర్శప్రాయమనీ స్వామీజీ గుర్తుచేశారు. బి.జె.పి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ యువత రామకృష్ణ పరమహంస, వివేకానందుల బోధనలను స్ఫూర్తిగా తీసుకొని దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ❖ **నివేదిక : సి.జె. శాస్త్రి**

శ్రీ పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ వేదాధ్యయనానుసన్ధాన ప్రతిష్ఠానమ్

ప్రవేశ / ఉద్యోగ ప్రకటన

1. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది కోర్సులకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) 'వేదచూడామణి' : ఋగ్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క అధ్యయనము
యోగ్యతలు : మాతృభాషలో చదువగలిగి, వ్రాయగలిగి ఉండాలి.
వయస్సు : 8 నుంచి 10 సంవత్సరాల మధ్య
స్టైఫండ్ : నెలకు రూ. 1,000/-

(ఆ) 'వేదార్థచూడామణి' : ఋగ్వేదము/ యజుర్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క భాష్యాధ్యయనము
యోగ్యతలు : సంస్కృత పరిజ్ఞానముతో బాటు ఏదో ఒక వేదాన్ని పూర్తిగా అధ్యయనం చేసి ఉండాలి.
వయస్సు : 15 సం॥, ఆ పైన
స్టైఫండ్ : నెలకు రూ. 3,000/-

2. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది ఉద్యోగాలకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) వేదాధ్యాపకుడు : (సామవేదము/ అథర్వవేదము - వేదానికి ఒక్కొక్కరు చొప్పున రెండు ఖాళీలు)
కావలిసిన అర్హతలు : క్రమాంతము లేక పదాంతము
అదనపు అర్హతలు : ఏదైన మఱియొక వేదము/ వేదభాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవము : 2 సంవత్సరములు
సంభావన : నెలకు రూ॥ 8,000/- మొత్తము, సౌకర్యములతో

(ఆ) వేదభాష్యాచార్యుడు : (ఒక్కొక్క వేదానికి ఒక్కొక్కరు చొప్పున 4 ఖాళీలు)
విద్యార్హత : ఏదైనా వేద భాష్యంలో ఉత్తీర్ణత
అదనపు అర్హత : మరొక వేద భాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవార్హత : 5 సం॥
సంభావన : నెలకు రూ. 10,000/- మొత్తము, సౌకర్యములతో

ముద్రించిన దరఖాస్తు ఫారములను **శ్రీ పి. వేంకటేశ్వర్లు గారు, మేనేజింగ్ డైరెక్టర్, కాకతీయ సిమెంట్, సుగర్ & ఇండస్ట్రీస్ లిమిటెడ్, 'గురుకృప' (ఆంధ్రా బ్యాంకు ఎదురుగా), 1 - 10 - 140/1, అశోక్‌నగర్, హైదరాబాద్ - 500 020** (ఫోను: 040 - 27637717) నుంచి ప్రత్యక్షముగా గాని, పోస్టు ద్వారా గాని పొందవచ్చు. పూర్తి చేయబడిన ఆ ముద్రిత దరఖాస్తులను ఈ పై అడ్రసుకు పంపవలెను. అవసరాన్ని బట్టి ఖాళీలను పూరించుట లోనూ, అర్హతల సవరణ లోనూ మేనేజ్‌మెంటుకు అధికారము కలదు.

సం/-

హైదరాబాద్ కులప్రశాసకుడు

Sponsored by:

KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED

Regd. Office : 1 - 10 - 140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad - 500 020
Ph: 2763 7717, 2763 3627, Fax No. 040-27630172, Email: info @ kakatiyacement.com

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**